Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in


సంపుటి : 1 సంచిక : 102 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 మే 2023 గురువారం పేజీలు : 4

## విద్యుత్‌కు పెరుగుతున్న డిమాండ్..

న్యూఢిల్లీ: దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలను కరెంటు కొరత వేధిస్తున్నది. ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతుండటం, వేడి గాలులు వీస్తుండటంతో నానాటికి కరెంటుకు డిమాండ్ పెరిగిపోతున్నది. అయితే బొగ్గు కొరత ఏర్పడటంతో డిమాండ్‌కు తగినట్లు విద్యుత్ ఉత్పత్తి అవడంలేదు. ఈ నేపథ్యంలో భారతీయ రైల్వే రంగంలోకి దిగింది. విద్యుత్ కేంద్రాలకు త్వరితగతిన బొగ్గును తరలించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేసింది. దీనికోసం గూడ్స్ రైళ్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తున్నది. ఇందులోభాగంగా భారీగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దుచేసింది. దీంతో ఈ నెల 24 వరకు దేశవ్యాప్తంగా 1100 రైళ్లను నిలిపివేయనున్నారు. ఇలా రద్దయినవాటిలో 500 ట్రిప్పుల ఎక్స్‌ప్రెస్ మెయిల్ రైళు, 580 ట్రిప్పుల ప్యాసింజర్ రైళ్లు ఉన్నాయి. ఏప్రిల్ 29న నాలుగు వందల బొగ్గు రైళ్లను నడపడానికి అనుగుణంగా 240 ప్యాసింజర్ ట్రెయిన్స్‌ను భారతీయ రైల్వే రద్దుచేసిన విషయం తెలిసిందే.

## ముందుకెళితే బీఆర్ఎస్‌కు ఆలస్యమైతే బీజేపికి

# 'అనుకూలమే'



## తెలంగాణాలో అక్టోబర్ లో ఎన్నికలు...?

హైదరాబాద్ : తెలంగాణాలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు డిసెంబర్ లో జరగాలి. పాత ప్రభుత్వానికి అధికారంలో ఉండే చివరి గడువు 2024 జనవరి 15 అని చెబుతారు. అంటే దానికి నెల రోజుల ముందు ఎన్నికలు పెట్టుకుంటే సరిపోతుంది. ఇపుడు తెలంగాణాలోని రాజకీయ పార్టీలు అన్నీ కూడా డిసెంబర్ నే డెడ్ లైన్ గా పెట్టుకుని పని చేస్తున్నాయి. తమ రాజకీయ అజెండాను సెట్ చేసుకుని ముందుకు సాగుతున్నాయి. అయితే ఇపుడు కొత్తగా ప్రచారంలోకి వస్తున్న మాట ఏంటి అంటే అక్టోబర్ లోనే తెలంగాణాలో ఎన్నికలు జరుగుతాయని. అంటే మూడు నెలలు ముందుకు ఎన్నికలు జరపబడుతాయన్న మాట. మరి డిసెంబర్ లో ఎన్నికలు పెట్టాల్సినది అక్టోబర్ కి ఎందుకు జరుపుతున్నారు. ఇది ఎవరి ఆలోచన. అసలు ఎందుకు ఇలా అన్నదే బిగ్ డిబేట్ గా ఉందిపుడు. ఇక్కడ మరో మాట కూడా వినిపిస్తోంది. డిసెంబర్ లో ఎన్నికలు అని షెడ్యూల్ ప్రకారం అయితే అవి నిజంగా జరుగుతాయా అన్న సందేహాలు వస్తున్నాయట. ఎందుకంటే డిసెంబర్ లో ఎన్నికలు అంటే అప్పటికి దేశంలో సార్వత్రిక ఎన్నికలకు పూర్తిగా గడువు దగ్గరపడుతుంది. తెలంగాణా మీద బీజేపీకి చాలా ఆశలు ఉన్నాయి. మొదటిది అధికారంలో వస్తామని ఒక వేళ రాకపోయినా పెద్ద ఎత్తున సీట్లు వస్తే నంబర్ గేమ్ ని ఆసరాగా చేసుకుని చక్రం తిప్పి అధికారాన్ని దక్కించుకుంటామని కూడా ఆలోచనలు ఉన్నాయట. అయితే ఒకవేళ అది కనుక కాకపోతే ఎన్నికలలో బీజేపీకి భంగపాటు ఎదురైతే అది కాస్తా ఆ తరువాత వెను వెంటనే జరిగే లోక్ సభ ఎన్నికల మీద తీవ్ర ప్రభావం చూపిస్తుందని కమలనాధులు కొత్త ఆలోచనలు చేస్తున్నారుట. ఈసారి దేశంలో చూస్తే ఉత్తరాదినా బీజేపీకి గణనీయంగా సీట్లు తగ్గుతాయని అంచనాలు ఆ పార్టీలోనే ఉన్నాయి. దాన్ని సౌత్ నుంచి భర్తీ చేసుకోవాలని చూస్తున్నారు. అందుకే తెలంగాణా మీద ఫుల్ ఫోకస్ పెట్టేసారు. అయితే తెలంగాణాలో అసెంబ్లీ ఎన్నికలు ముందు జరిగి బీజేపీకి నెగిటివ్ రిజల్ట్స్ వస్తే కనుక కచ్చితంగా అది 2024లో జరిగే లోక్ సభ ఎన్నికల మీద తీవ్ర ప్రభావం చూపించడం ఖాయం. దాంతో డిసెంబర్ లో ఎన్నికలు అంటే కనుక ఏదో ఒక సెక్షన్ ఆధారం చేసుకుని ఆ ఎన్నికలను వాయిదా వేసి 2024లో జరిగే లోక్ సభ ఎన్నికలతోనే జరిపిస్తారు అని ఒక టాక్ అయితే వినిపిస్తోంది. అంటే అప్పటిదాకా రాష్ట్రపతిపాలన పెట్టేసి తమ కంట్రోల్ లో తెలంగాణా అధికారాన్ని ఉంచుకునే విధానం అన్న మాట. నిజానికి దీన్ని బీయారెస్ కాంగ్రెస్ కచ్చితంగా ఎదిరిస్తాయి. కానీ బీజేపీ రాజకీయాల ముందు ఇవేమీ పనిచేయవు. అందుకే డిసెంబర్ లో ఎన్నికలు జరిగేది ఉండదనే అంటున్నారు. మరి అక్టోబర్ లో ఎన్నికలు పెట్టడం ఎవరి అభిమతం అన్నది కూడా ఇక్కడ చూడాల్సి ఉంటుంది. ఇక అక్టోబర్ లో ఎన్నికలు అంటే అది ఎవరికి మేలు అన్న దాని మీద కూడా ఎవరికి తోచిన విశ్లేషణలు వారు చేస్తున్నారు. కర్ణాటక గెలిస్తే కనుక ఆ ఊపులో కాంగ్రెస్ కి ఈ ఎన్నికలు ప్లస్ అవుతాయని అంటున్నారు. బీయారెస్ కి ముందుగా ఎన్నికలు పెడితే గెలుపు అవకాశాలు ఏమైనా పెరుగుతాయా అన్నాది మరో వాదన. ఇక బీజేపీ కి మాత్రం ముందుకు జరిపితే సమయం సరిపోదనే అంటున్నారు. కానీ కమలనాధుల ఆలోచన మాత్రం అయితే 2024 సార్వత్రిక ఎన్నికలతో పాటే పెడితే బాగుంటుంది అంటున్నారు. మరి చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## ఎమ్మెల్యేలకు సైతం ఎంట్రీ ఇవ్వని సచివాలయం.. ఇదేంది కేసీఆరూ?



హైదరాబాద్ : ప్రజల సొమ్ముతో కట్టిన సచివాలయానికి ప్రజలకు అనుమతి లేకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే.. సచివాలయం సందర్శన స్థలం కాదు. రాష్ట్ర పాలనకు కేంద్రంగా నిలిచే కార్యాలయాన్ని సందర్శన స్థలంగా మార్చటంలో అర్థం లేదు. అయితే.. అవసరమైన వారు ఎవరైనా సచివాలయానికి వెళ్లి వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలి. సామాన్యుల సంగతి తర్వాత.. వీఐపీలైన ఎమ్మెల్యేలు.. అందునా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు సైతం నో ఎంట్రీ అంటే ఏమని చెప్పాలి? ఎలా చూడాలి? రాజమహాల్ కు ఏ మాత్రం తీసిపోని రీతిలో నిర్మించిన సచివాలయంలోకి వచ్చి వెళ్లాలంటే సాధ్యమా? అన్న సందేహాలు నిర్మాణ దశలోనే చోటు చేసుకున్నాయి. ఇప్పుడు ఆ అనుమానాలు నిజాలుగా మారాయి. సోమవారం పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు సచివాలయాన్ని చూసి.. ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసేందుకు వచ్చారు. అయితే.. అక్కడి భద్రతా సిబ్బంది ఎమ్మెల్యేలకు సైతం అనుమతి లేదని చెప్పటంతో అవాక్కు అయ్యారు. ఇదే మీ శత్రు దుర్భేధ్యమైన కోట కాదు కదా? సాదాసీదా సచివాలయం కదా? ప్రజల అవసరాల్ని తీర్చేందుకు.. పాలనకు వీలుగా ఏర్పాటు చేసే ఒక ప్రభుత్వ కార్యాలయాన్ని రక్షణ శాఖకు చెందిన రహస్యమైన ఆఫీసుగా మార్చటంలో అర్థం లేదు. ఎందుకిలా చేస్తున్నట్లు? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు సైతం నో ఎంట్రీ అన్న అధికారుల మాటలతో బదులు చెప్పలేక.. అవమానభారంతో తిరిగి వెళ్లాల్సి వచ్చిందంటున్నారు. ఆ తర్వాత విషయం తెలిసి.. కొందరు ఎమ్మెల్యేలను కాసేపటి తర్వాత అనుమతి ఇచ్చినట్లుగా చెబుతున్నారు. ఎమ్మెల్యేలకే ఇలాంటి పరిస్థితి ఉంటే.. సచివాలయంలోని కొందరు ఉద్యోగులకు మాత్రం అలాంటి పరిస్థితి ఉండదా? పలువురు సచివాలయ ఉద్యోగులకు భద్రతా సిబ్బంది నో చెప్పటంతో వారు లోపలకు వెళ్లలేకపోయారు. కొందరు తమ హెడ్ వోడీలకు తమకు ఎదురైన ఇబ్బందుల్నితెలియజేయగా.. వారు జోక్యం చేసుకొని లోపలకు వచ్చేలా ఏర్పాట్లు చేసినట్లుగా తెలుస్తోంది. ఏమైనా.. భారీ ఎత్తున నిర్మించిన సచివాలయంలోకి అధికారపార్టీ ఎమ్మెల్యేలు.. సిబ్బందినే అనుమతించకుండా చుక్కలు చూపిస్తున్న వేళ.. ఏదైనా సమస్య చెప్పుకోవటానికి వెళ్లే సామాన్యుల మాటేమిటి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.




## నేడు ఢిల్లీలో బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ప్రారంభం..

హైదరాబాద్ : దేశ రాజధాని ఢిల్లీలో బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం నిర్మాణం పూర్తయింది. ఈ నేపథ్యంలో గురువారం మ. 1:05 గంటలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు వసంత్ విహార్‌లోని బీఆర్ఎస్ ఆఫీసుకు సీఎం చేరుకోనున్నారు. హెూమం, యాగం, వాస్తు పూజల్లో కేసీఆర్ పాల్గొననున్నారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలోనే పార్టీ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ గంట పాటు సమావేశం నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కలిసి ప్రారంభోత్సవ ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఇప్పటికే మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు ఢిల్లీకి చేరుకున్నారు. కేసీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే పార్టీ కార్యాలయాన్ని తమ ఆధీనంలో తీసుకున్న భద్రతా బలగాలు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.




## మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు

# అనుకూల పవనాలు

## స్పీడు పెంచుతున్న 'కారు సారు'

మహారాష్ట్రలో బీఆర్ఎస్ గాలి ఉధృతంగా వీస్తోందా ? ఏమో వీస్తోందని కేసీయార్ అంటున్నారు కాబట్టి మనం కూడా అలాగే అనుకోవాలేమో. మహారాష్ట్ర నుండి వచ్చిన కొందరు బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా కేసీయార్ మాట్లాడుతు రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ మహారాష్ట్ర లో ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలగురించి వాళ్ళతో కేసీయార్ చర్చించారు. అవినీతి రహిత పాలన అందించటమే బీఆర్ఎస్ ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పారు. ప్రజాప్రతినిధులకు ఆయా నియోజకవర్గా ల్లో ప్రభుత్వ నిధులతో ఆఫీసులు కట్టించిన ఘనత దేశంమొత్తంమీద బీఆర్ఎస్ కు మాత్రమే సొంతమన్నారు. పార్టీకి అనుబంధంగా వివిధ శాఖలు ఏర్పాటుచేయబోతున్నట్లు చెప్పారు. తొందరలోనే 28 నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ కార్యవర్గాలను ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. మహారాష్ట్రను తొందరలోనే తలెత్తుకుని చూసేట్లు చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణా ప్రగతి మోడల్ మహారాష్ట్ర లో అందరినీ ఆకర్షిస్తున్నట్లు కేసీయార్ వివరించారు. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే మహారాష్ట్ర లో బీఆర్ఎస్ గాలి వీస్తోందనేందుకు కేసీయార్ కున్న ఆధారం ఏమిటో తెలీదు. ప్రభంజనం ఎలా సృష్టించబోతోందో కేసీయారే చెప్పాలి. ఎందుకంటే నాలుగురోజుల క్రితమే జరిగిన సొసైటీ ఎన్నికల్లో పోటీచేసిన బీఆర్ఎస్ ఒక్క సొసైటీ లో కూడా గెలవలేదు. రాబోయే ఎన్నికల్లో ఉనికిని చాటుకుంటే ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపుతుందంటే ఎవరైనా నమ్ముతారు. అంతేకానీ ప్రభంజనమే సృష్టిస్తుందంటే ఎవరు నమ్ముతారు ? ఇక నియోజకవర్గాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆఫీసులు దండగమారి ఖర్చులే అని అందరికీ తెలుసు. ఇలాంటి అనేక దండగమారి ఖర్చుల కారణంగానే మంత్రులు ఎంఎల్ఏలపై అవినీతి ఆరోపణలు బాగా పెరిగిపోయాయి. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో 45 మంది ఎంఎల్ఏలు అవినీతికి పాల్పడినట్లు స్వయంగా కేసీయారే చెప్పారంటే అవినీతి ఏ స్థాయిలో జరుగుతోందో అర్థంచేసుకోవచ్చు. బీఆర్ఎస్ దగ్గర పార్టీ నిధులు భారీ ఎత్తున ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది కాబట్టే కొందరు నేతలు పార్టీలో చేరటానికి ఉత్సాహం చూపుతున్నట్లున్నారు. కాబట్టి రాబోయే ఎన్నికల్లో ఇతర పార్టీలకు బీఆర్ఎస్ గట్టి పోటీ ఇవ్వగలిగితే అదే పదివేలని అనుకోవాలి.

# సంపాదకీయం

## ప్రపంచ గుర్తింపే.. మనసులో మాటకు ప్రతీక

# మోడీ వ్యూహం

తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ.. ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్(మనసులో మాట)కు.. 100 ఎపిసోడ్లు పూర్తయ్యాయి. అయితే.. 100 ఎపిసోడ్(ఏప్రిల్ 30)ను ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్లు ఖర్చు పెట్టిమరీ భారీ ఎత్తున ప్రచారం చేశారు. అయితే.. దీని వెనుక వ్యూహం ఉందనేది జాతీయ మీడియా మాట. ప్రపంచ గుర్తింపు కొరుతున్న ప్రధాని మోడీ.. చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. 2024 ఎన్నికలను ప్రభావితం చేయగల రీతిలో ఆయన ఈ 100 వ ఎపిసోడ్ను తీర్చిద్దారని చెబుతున్నాయి. ఇక మన్ కీ బాత్ వందో ఎపిసోడ్ అమెరికాలోనూ ప్రసారమైంది. దీనిని గౌరవిస్తూ అమెరికాలోని న్యూయార్క్ న్యూజెర్సీ రాష్ట్రాలు ప్రత్యేక తీర్మానాలు చేశాయి. అనంతరం వాటిని భారత విదేశాంగ మంత్రి జైశంకర్కు అందజేశాయి. అదేవిధంగా ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలోనూ ప్రధాని మోడీ మన్కీ బాత్ వందో ఎపిసోడ్ను ప్రసారం చేశారు. అమెరికాలో నిర్వహించిన మన్కీ బాత్ వందో ఎపిసోడ్లో ప్రవాసాంధ్రులతో కలిసి విదేశాంగ మంత్రి జైశంకర్ పాల్గొన్నారు. లండన్లోని ఇండియా హౌస్లో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఎన్ఆర్ఐలు.. హై కమిషన్ అధికారులతో కలిసి మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేయడం ఈ దఫా 100వ ఎపిసోడ్ప్రాధాన్యం. దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ మన్కీ బాత్ వందో ఎపిసోడ్ను కనీవినీ ఎరుగని ఏర్పాట్లతో కోట్లాది మంది ప్రజలు ఆలకించేలా భారతీయ జనతా పార్టీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 4 లక్షల ప్రాంతాల్లో.. ప్రజలు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. దేశంలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సరాసరిన వంద చోట్ల ప్రజలు ఆలకించేలా కమలం పార్టీ ఏర్పాట్లు చేసింది. గవర్నర్ల అధికారిక నివాసమైన అన్నిరాష్ట్రాల రాజ్ భవన్లు బీజేపీ పాలిత రాష్ట్రాలు మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రుల నివాసాల్లో మన్ కీ బాత్ వందో ఎపిసోడ్ను ప్రసారం చేశారు. మొత్తంగా చూస్తే.. 2024 ప్రతిబింబం.. స్పష్టంగా కనిపించిందనేది విశ్లేషకుల మాట.

# లీజు స్థలాలపై.. సర్కారు దృష్టి



ఆదిలాబాద్ : జిల్లాలోని లీజు భూములపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో లీజుకు ఇచ్చిన స్థలాల వివరాలను పంపాలని ఆదేశాలను జారీ చేసింది. ప్రైవేటు వ్యక్తులకు, ఇతర సంస్థలకు ఇచ్చిన లీజు భూములు ఎక్కడెక్కడున్నాయి. ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, ప్రస్తుతం ఏ పరిస్థితులున్నాయో ఈ నెల 10లోగా సమగ్ర వివరాలను పంపాలని కోరింది. దీంతో జిల్లా అధికారులు తహసీల్దార్లకు ఆదేశాలను జారీ చేశారు. ఎనిమిది అంశాలతో కూడిన నమూనా ఆధారంగా వివరాలను పొందుపర్చి పంపాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో రెవెన్యూ యంత్రాంగం మండలం, గ్రామం, సర్వే నెంబరు, విస్తీర్ణం, పేరు, లీజు పీరియడ్, లీజు లక్ష్యం, సంబంధిత జీఓ వంటి ఎనిమిది అంశాల వారీగా వివరాలను సేకరించే పనిలో పడింది.

పట్టణంలో రూ. 200 కోట్ల ఆదాయం..రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ బల్దియాకు లీజు భూములున్నాయి. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న వీటిని విక్రయిస్తే రూ.వందల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని లీజు భూముల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. బల్దియా దశాబ్దాల కిందట ప్రైవేటు వ్యక్తులకు స్థలాలను కౌలు(లీజు)కు ఇచ్చింది. గతంలో 43 కౌలు స్థలాలుండగా అవి అన్యాక్రాంతం అవుతూ వచ్చాయి. ప్రస్తుతం 22 కౌలు స్థలాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. అందులో ముఖ్యంగా సినిమా రోడ్డు, వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని పారిశ్రామిక ప్రాంతం, భుక్తాపూర్, తాంసి బసాండ్ ఏరియాలో ఈ స్థలాలు మిగిలి ఉన్నాయి. 40, 50 ఏళ్ల కిందట ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు కౌలుకు ఇవ్వగా తర్వాత వచ్చిన పాలకవర్గాలు వాటి జోలికి వెళ్లలేదు. దీంతో లీజు పెంచడం మాట అటుంచి బకాయిలను వసూలు చేయలేదు. వాస్తవానికి మూడేళ్లకోసారి ఈ లీజు స్థలాలపై సమీక్షించాలి. మళ్లీ ఒప్పందాలు చేసుకోవాలి. అవేవీ పాటించకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోనే ఉన్నాయి. ఇటీవల మూడు స్థలాలను మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకుంది. ఇంకా రూ.కోట్లాది విలువైన స్థలాలకు రెవెన్యూ అధికారులు పట్టాలివ్వడంతో 20 ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. వాస్తవానికి మున్సిపల్ స్థలాలకు పట్టాలిచ్చే అధికారం రెవెన్యూ అధికారులకు లేదు. ఇక్కడ మాత్రం క్రమబద్ధీకరణకు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ పేరిట చాలా మంది పట్టాలు చేసుకున్నారు. పట్టాల రద్దు కోసం జిల్లా పాలనాధికారికి పుర అధికారులు విన్నవించినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఈ స్థలాలన్నింటిపై దృష్టి సారించి విక్రయిస్తే పురపాలక సంఘానికి భారీగా ఆదాయం సమకూరుతుంది.

# అక్రమార్కుల చెట్టాపట్టాల్..



నిర్మల్ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరావాస గ్రామాల్లో రూ.కోట్ల విలువ చేసే భూములకు అక్రమంగా పట్టాలు పుట్టుకొస్తున్నాయి. భవిష్యత్తు అవసరాలకు వదిలిపెట్టిన భూములు ఇతరుల పేర్ల మీదకు బదిలీ అవుతున్నాయంటూ సామాన్యులు వాపోతున్నారు. చర్యలు తీసుకోండంటూ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నారు. అనేక విధాలుగా నిరసన తెలుపుతున్నారు.. అయినా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి చర్యలు కనిపించట్లేదు. ఒక్క అక్రమ పట్టాలను కదిలించట్లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని పునరావాస గ్రామాల్లో ఈ అవినీతి బాగోతం యథేచ్ఛగా జరుగుతోంది.

ఎందరో సహకరిస్తున్నారు..పునరావాస గ్రామాల భూములపై పట్టున్న కొందరు వ్యక్తులు ముఠాలుగా ఏర్పడి డీ-1 పట్టాలు పుట్టించేందుకు సహకరిస్తున్నారు. కొందరు అధికారులను మచ్చిక చేసుకొని దర్జాగా తమ పని కానిచ్చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రెండేళ్లలో దాదాపు 200 ఎకరాలకు పైగానే అన్యాక్రాంతమైంది. భూములతో సంబంధం ఉన్న శాఖలోని అధికారులు, ఇతర సిబ్బంది సూత్రదారులుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ మిగుల భూముల గురించి వివరిస్తూ ఎకరాకు ఇంత అంటూ బేరసారాలు చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..జిల్లాలో 32 గ్రామాలు ఎస్సారెస్పీలో ముంపునకు గురయ్యాయి. ఈ గ్రామాలకు అప్పటి అధికారులు ప్రభుత్వ భూములను సేకరించి పునరావాసం కల్పించారు. వ్యవసాయం చేసుకునే కుటుంబాలకు అయిదెకరాల వ్యవసాయ భూమితో పాటు ఇంటి నిర్మాణానికి రెండు ప్లాట్లు, వ్యవసాయం లేని కుటుంబాలకు ఒక్కో ప్లాటు కేటాయించారు. భవిష్యత్తు అవసరాల కోసం వ్యవసాయ భూమిని, గృహ నివాసం కోసం కొంత భూమిని వదిలిపెట్టారు. ఈ భూములే అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రామాల్లో మిగులు భూములు ఉన్నాయని తెలిసిన కొందరు వ్యక్తులు కొన్నేళ్లుగా కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలోని ఎస్సారెస్పీ పునరావాస ప్రాంతాల్లో ఇచ్చిన భూములకు సంబంధించి డీ-1 పట్టాలు పుట్టించి తమకు అప్పట్లో భూములు కేటాయించలేదని, ఇప్పుడు ఇవ్వాలంటూ ఎస్సారెస్పీ పునరావాస అధికారులకు దరఖాస్తులు చేసుకుని ఆ జిరాక్స్ పట్టా పత్రాలు పొందుతుండగా.. మరికొందరు నకిలీ పట్టా పత్రాలు సృష్టించి ఇక్కడి అధికారులను మచ్చిక చేసుకుని మిగులు భూములను కైవసం చేసుకుంటున్నారు. రాజకీయ పలుకుబడి, పరిచయాలు ఉన్న వ్యక్తులు స్థానిక రెవెన్యూ అధికారుల అండతో ఎస్సారెస్పీ కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి సిబ్బందిని మచ్చిన చేసుకుని అప్పటి అధికారుల పేరు మీద పత్రాలు సృష్టించి వారి సంతకాలు ఫోర్జరీ చేసి పట్టాలు పొందుతున్నట్లు తెలుస్తోంది.

ఆందోళనలు చేస్తున్నా.. పట్టించుకోని వైనం...తమ గ్రామాలకు మిగులు భూములు లేకుండా చేస్తున్నారంటూ పునరావాస గ్రామాల ప్రజలు తరచూ ఆందోళన చేస్తున్నారు. కొద్ది నెలల క్రితం న్యూసాంగ్వి గ్రామస్థులు తమ ఊళ్లోని భూములకు అక్రమంగా పట్టాలిచ్చారంటూ తీవ్ర స్థాయిలో చేసిన ఆందోళన ఫలితంగా విచారణ చేస్తామని అధికారులు చెప్పినా తర్వాత పట్టించుకోలేదు. గతంలో మామడ మండలం లింగంపల్లి, లక్ష్మణచాంద మండలం కంజర్, నిర్మల్ మండలం కొత్త పోచంపాడ్, సోన్ మండలం వెల్మల్, బొప్పారంలోనూ ఈ పట్టాలు పుట్టుకొచ్చాయి. పెద్ద ఎత్తున్న అక్రమాలు జరిగాయి. అక్కడ చాలా మంది ప్రముఖుల పేర్లపై పట్టాలు ఉన్నాయి. తాజాగా ఆదర్శనగర్-కమల్‌కోట్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. మిగులు భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. డీ-1పట్టాలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపితే జిల్లాలో భూభాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలిగంగారెడ్డి, గ్రామస్థులు

కమల్‌కోట్-ఆదర్శనగర్‌లోని సర్వే నెంబరు 17లో 30 ఎకరాలకుపైగా మిగులు భూమి ఉంది. గ్రామ అవసరాలకు వదిలేసిన ఈ భూమిని డీ-1 పట్టాలు ఉన్నాయని కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలి.

ఖాళీ భూమి కనిపిస్తే కబ్జా చేస్తున్నారు

ముత్యంరెడ్డి, సర్పంచిపునరావాస గ్రామాల్లో ఖాళీగా భూమి కనిపిస్తే చాలు.. తమకు డీ-1 పట్టా ఉందని.. ఇక్కడే కేటాయించారని చెబుతూ హద్దులు పెట్టుకున్నారు. గ్రామంలో ఎఫ్‌సీఐ గోదాం, పశువులు, ఇతర అవసరాలకు ఉందనుకున్న మా గ్రామ శివారులోని భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు.

# వాహనాల కొరత.. అమ్మలకు అవస్థ

మంచిర్యాల : సర్కారు ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు, గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలను నేరుగా ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాలకు తరలించేందుకు, రవాణాపరంగా అవస్థలు పడకుండా అందుబాటులోకి తీసుకొచ్చిన.. 102 వాహనాల సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతుండటం, కుమురంభీం జిల్లాతో పాటు మహారాష్ట్ర వాసులుసైతం మంచిర్యాల బాట పడుతుండటంతో వాహనాల కొరత ఏర్పడుతోంది. రెండు జిల్లాల్లో 30కి పైగా మండలాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉండగా వీటికి కేటాయించిన వాహనాలు మాత్రం తగినంతగా లేవు. కుమురంభీం జిల్లా(ప్రసూతి సేవలు) భారం పూర్తిగా మంచిర్యాల జిల్లాపై పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతమున్న వాహనాలతోనే ఎలాంటి సమస్య లేకుండా సర్దుబాటు చేస్తున్నామని జీవీకే ఈఎంఆర్ఐ అధికారులు చెబుతున్నా మరిన్ని తీసుకొస్తే సేవలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.జిల్లాలో పది మాత్రమే..జిల్లాలో 18 మండలాలు, 17 పీహెచ్‌సీ, 4 యూపీహెచ్‌సీ, 3 సీహెచ్‌సీలు ఉన్నాయి. 102 వాహనాన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఒకటి చొప్పున అందుబాటులో ఉంచితే 17వాహనాలు అవసరమవుతాయి. కానీ 10 మాత్రమే ప్రస్తుతం సేవలందిస్తున్నాయి. ఈ వాహనాలు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయి. ఒక్క గర్భిణి ఉన్నా ఇంటి నుంచి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. తప్పనిసరిగా తిరిగి గమ్యస్థానానికి చేర్చాలి. గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే గర్భిణులకు రవాణాపరంగా ఇబ్బంది కలగకుండా ఈ వాహనాలు సేవలందించాలి. కానీ జిల్లాలోని మారుమూల మండలాలైన వేమనపల్లి, కోటపల్లి, నెన్నెల, భీమారం, తాళ్లగురిజాల, భీమిని, కన్నెపల్లి తదితర వాటిల్లో ఇప్పటికీ సౌకర్యం లేదు. ఈ ప్రాంతాల్లో వాహనాల నదుపాయం కల్పిస్తే ప్రయోజనం చేకూరుతుంది.మండలానికి ఒకటి చొప్పున అందిస్తే...రెండు జిల్లాలకు సంబంధించిన గర్భిణులు మంచిర్యాలకే వస్తుండటంతో కుమురంభీం జిల్లా నుంచి వచ్చి, వెళ్లే బాధితులు రవాణాపరంగా అవస్థలు పడుతున్నారు. ఇక్కడి ఆసుపత్రిలో ప్రసవించే వారు ఎక్కువగా కుమురంభీం జిల్లాకు చెందినవారు ఉండటం, వీరిని ఇంటికి పంపించేందుకు జిల్లా వాహనాలే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. దీంతో జిల్లా బాధితులకు సమయానికి సేవలు అందక కొంత ఇబ్బందులు పడుతున్నారు. మండలానికి గానీ ఒక్కో ఆరోగ్యకేంద్రానికి ఒకటి చొప్పున కేటాయిస్తే సేవలను మరింత విస్తృతం చేసేందుకు వీలుంటుంది.ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం- కొండల్‌రావు, 102, 108 వాహనాల నిర్వహణాధికారి

# అధికారుల అనాసక్తి.. మూడే పూర్తి

భైంసా : ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం నత్తనడకన సాగడంతో రోగులకు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. జాతీయ ఆరోగ్య గ్రామీణ మిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌ఎం) పథకం కింద కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 2020-21 ఆర్థిక సంవత్సరంలో 15 ఆరోగ్య ఉపకేంద్రాల (సబ్‌సెంటర్లు)కు, ఒక్కో భవనానికి రూ.16లక్షల నిధులు మంజూరు చేసింది. అధికారుల, గుత్తేదార్ల అలసత్వం కారణంగా వీటి పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరి కొన్ని చోట్ల వాటి నిర్మాణానికి గుత్తేదార్లు ముందుకు రాకపోవడం గమనార్హం. గ్రామీణ ప్రజలకు ఏ చిన్న రోగం వచ్చినా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాని(పీహెచ్‌సీ)కి, ఆరోగ్య ఉపకేంద్రాలే దిక్కు. పీహెచ్‌సీలకు పక్కా భవనాలున్నా వాటి పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రాల(సబ్‌సెంటర్లు)కు స్వంత భవనాలు లేవు. పలుచోట్ల అద్దె భవనాల్లో కొనసాగిస్తుండగా మరి కొన్నిచోట్ల అవి లభించక స్థానిక అంగన్‌వాడీ (అవీ అద్దె గదులే)లో, గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్నారు. ఇరుకైన గదుల్లో ఇరు శాఖల కార్యకలపాలు నిర్వహించుకోలేక పనిచేసే సిబ్బంది, వైద్యం కోసం వచ్చే రోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

అందించాల్సిన సేవలు

ఇరుకు గదుల్లో తమకే కూర్చునేందుకు స్థలం లేకపోతే వచ్చే రోగులకు సేవలు ఎలా అందించగలమని సిబ్బంది వాపోతున్నారు. ప్రతి రోజు వచ్చే రోగులకు వైద్యఆరోగ్య, రక్త, క్షయ పరీక్షలు చేయాలి. చిన్నారులకు, గర్భిణులకు నెలవారీ టీకాలు, రక్తపోటు, క్షయ, మధుమేహ రోగులకు, చిన్నా, చితక వ్యాధులకు మాత్రలు అందించాలి. మందుల, రసాయనాలు, వైద్య పరీక్ష పరికరాలు, ల్యాబ్ ఏర్పాటు, నీటి వసతి కల్పించాలి. స్థలసమస్యతో ఇవి చేయడం సాధ్యపడటం లేదని కొందరు సిబ్బంది అంటున్నారు.

కొండంత అవసరం గోరంత మంజూరు

జిల్లాలో మూడొంతుల ఆరోగ్య ఉపకేంద్రాలకు స్వంత భవనాలు లేవు. కొండంత అవసరానికి గోరంత అన్నట్లు కేవలం 15కేంద్రాలకు స్వంత భవనాలు మంజూరు చేయడం. అవి సైతం సంవత్సరాల తరబడి నిర్మాణ పనులు పూర్తిచేయకపోవడం అధికారుల వైఫల్యాలకు నిదర్శనం.

ఆరోగ్య ఉపకేంద్రాలు 106
స్వంత భవనాలు కల్గినవి : 32
అద్దె/అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ/ఇతర భవనాల్లో కొనసాగుతున్నవి : 74
మంజూరైన భవనాలు: 15
టెండర్లు పూర్తిచేసినవి: 15
చేపట్టినవి: 11
పూర్తయినవి : 3 మల్లాపూర్, బిలోలి, కామోల్
గుత్తేదార్లు ముందుకు రాక రద్దుచేసినవి : 04 కొరటికల్, రాజూరా, హంగిర్గా, వడ్యాల్
పనులు చివరిదశలో : 5 చించోలి, గోసానిపల్లి, కౌట, పార్డి-బి
గోడల నిర్మాణ దశలో : 3 అక్కాపూర్, అంబారిపోట, దేగాంఒ

త్వరలోనే పూర్తిచేస్తాంఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ సకాలంలోనే పూర్తయినా వివిధ కారణాలతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. చాలా భవనాల నిర్మాణం పూర్తికావస్తోంది. నాలుగు కేంద్రాల టెండర్లను రద్దుచేసి పీఆర్‌శాఖకు అప్పగించారు. పిల్లర్లు, పైకప్పుల వరకు పూర్తయిన మూడు భవనాల నిర్మించే గుత్తేదార్లుకు నోటీసులు జారీచేశాం. త్వరలోనే అవి పూర్తిచేయిస్తాం.
-గంగాధర్‌గౌడ్, డీఈఈ, ఈడబ్ల్యుఐడీసీ, నిర్మల్

# అడ్డగోలు తవ్వకం.. అనుమతులు బహుదూరం

ఆసిఫాబాద్: నాలుగు ప్రొక్లయిన్లు, పన్నెండు లారీలు.. రాత్రీపగలు తవ్వకాలు. అనుమతులు లేకుండా మొరం తరలింపు ఇదీ ప్రస్తుతం రెబ్బెన మండలంలో నిత్యం జరుగుతున్న తంతు. నాలుగు వరుసల రహదారి పనులు చేసే గుత్తేదారు కావాల్సిన మొరం కోసం మొదట దరఖాస్తు చేసుకొని ఆ తర్వాత నాణ్యతలేదని రాసిచ్చారు. అయినప్పటికీ యథేచ్ఛగా నిత్యం వందలాది లారీ ట్రిప్పుల మొరాన్ని తవ్వుతున్నారు. వాగును పూడ్చి రోడ్డు వేసి మరీ ఈ దందాను కొనసాగిస్తున్నా.. గనులశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు.ప్రస్తుతం జిల్లాలో నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. అత్యున్నత ప్రమాణాలతో పది కాలాలపాటు మన్నికగా పూర్తి చేయాల్సిన పనులు ఆది నుంచి వివాదాస్పదం అవుతున్నాయి. నాసిరకంగా పనులు చేపడుతున్నారు. పని ప్రదేశానికి సమీపంలోని పంట పొలాల నుంచి మట్టిని వినియోగిస్తున్నారు. మట్టి నాణ్యతపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అభ్యంతరం చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. వాస్తవంగా మొరం తవ్వకాలకు స్థానిక తహసీల్దార్ ఎన్‌ఓసీ(నిరభ్యంతర పత్రం) జారీ చేయాలి. గనులశాఖ అధికారులకు క్యూబిక్ మీటరకు రూ.40 చొప్పున రాయల్టీ చెల్లించాలి. వీరి అధ్వర్యంలో నిర్దేశించిన కొలతల మేరకు తవ్వకాలు జరపాలి. కానీ ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు.వాగును పూడ్చి రోడ్డు వేసి..

రెబ్బెన మండలంలోని నేర్పల్లి శివారు ప్రాంతంలో వాగు ప్రవహిస్తుంది. ఈ వాగుపై దర్జాగా రోడ్డు వేశారు. వాగును ఆనుకుని ఉన్న పంట పొలాల్లో భారీ స్థాయిలో తవ్వకాలు చేపడుతున్నారు. నిత్యం 220 లారీల మట్టి తరలిపోతోంది. 54 కిలోమీటర్ల రహదారికి 30 లక్షల క్యూబిక్ మీటర్ల పైగానే మొరం అవసరమని అధికారుల అంచనా. గుత్తేదారు మాత్రం ఇప్పటి వరకు గనులశాఖకు 3 లక్షల క్యూబిక్ మీటర్లకు కేవలం రూ.1.13 లక్షలు రాయల్టీ డబ్బులు చెల్లించారు. అది కూడా పలుమార్లు అక్రమ తవ్వకాలపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాల తర్వాతే చెల్లించడం గమనార్హం.

నేర్పల్లిలోని సర్వే నంబర్ 97/ఏలో రెండు హెక్టార్లలో తవ్వకాల కోసం గుత్తేదారు గనులశాఖకు నవంబర్ 2021లో దరఖాస్తు చేసుకున్నారు. అనుమతులు రాలేదు. మట్టి వదులుగా ఉందని దరఖాస్తును వాపస్ తీసుకుంటున్నట్లుగా 2022 ఏప్రిల్ 28న గనులశాఖకు రాతపూర్వకంగా ఇచ్చారు. వాస్తవంగా ఈ మధ్య కాలంలో అనుమతులు ఏవీ రాకున్నా దాదాపు పది ఎకరాల్లో మొరం నిత్యం తరులుతూనే ఉంది. పనికిరాదని గుత్తేదారే స్వయంగా చెప్పి మళ్లీ అదే మట్టిని వాడటం గమనార్హం.జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 20 లక్షల క్యూబిక్ మీటర్ల మొరం తరలిపోయిందని సమాచారం. రూ.కోట్ల విలువైన మొరాన్ని భారీ స్థాయిలో గుత్తేదారు తరలించుకుపోతున్నా, గనులశాఖ, రెవెన్యూశాఖ పట్టించుకోవడం లేదు. అధికారుల అండదండలతోనే ఈ తతంగం సాగుతోందని స్పష్టమవుతుంది.

అనుమతులు ఇవ్వలేదు.. : నాగరాజు, గనులశాఖ ఏడీ

రెబ్బెన మండలంలో మట్టి తవ్వకాలు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకున్న కొన్నింటిని తిరస్కరించాం. అనుమతులు లేకుండా తవ్వకాలు సాగితే సంబంధిత వ్యక్తులపై జరిమానాలు విధిస్తాం.

# ఇల్లెందు.. మళ్లీ ముందు

ఖమ్మం : ఇల్లెందు పురపాలకం మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే పట్టణంలో తడి, పొడి చెత్తను సేకరించి డీఆర్‌సీసీ భవనంలో ఎరువు తయారు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు సాధించిన విషయం తెలిసిందే. అదేవిధంగా మానవ మల, మూత్ర వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసే కేంద్రాన్ని నిర్మించి మరో రికార్డు నమోదు చేసుకుంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బైపాస్‌లోని చెత్త డంపింగ్ యార్డు ఆవరణలో ఏడాదిగా నిర్మిస్తున్న 10 కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన మానవ మల, మూత్ర వ్యర్థాల శుద్ధి కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణం పూర్తయింది. జిల్లాలోనే మొట్టమొదటి సారి ఇల్లెందులో ఈ కేంద్రాన్ని నిర్మించారు. మానవుల నుంచి వచ్చే వ్యర్థాన్ని సేకరించి ఎరువుగా తయారు చేసేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ. 80 లక్షలతో అన్ని రకాల యంత్రాలు, పరికరాలను బిగించారు. రెండు రోజుల క్రితం ఎరువు తయారీ ప్రక్రియను పురపాలక ఛైర్మన్ డీవీ, కమిషనర్ షేక్ అంకుశ్ షావలీలు పరిశీలించారు.

ఎరువు తయారీ విధానం

ఇళ్లలో నిండిన సెప్టిక్ ట్యాంకు నుంచి పురపాలక సెప్టిక్ ట్యాంకు వాహనం ద్వారా మానవ వ్యర్థాన్ని ఎఫ్ఎస్‌టీపీ కేంద్రానికి తీసుకువ



స్తారు. దాన్ని స్క్రీనింగ్ ఛాంబర్‌లో అన్‌లోడ్ చేస్తారు. అక్కడ నుంచి కలెక్టింగ్ ట్యాంకుకు పంపి మోటారు ద్వారా డివాటరింగ్ యంత్రానికి చేరుస్తారు. అక్కడ వ్యర్థంలోని ఘన పదార్థం, నీరు వేరుచేస్తారు. ఘన పదార్థాన్ని సోలార్‌బెడ్ వద్దకు పంపించి వేడి చేయడంతో అది ఎండిపోతుంది. దాన్ని క్రషింగ్ చేసి పొడిగా మారుస్తారు. అనంతరం అది ఎరువుగా తయారవుతుంది. క్రషింగ్‌లో తేడాలను ల్యాబ్‌లో పరిశీలించుకుంటూ ప్రక్రియను కొనసాగిస్తారు. తయారు చేసిన ఎరువును పురపాలకం ఆధ్వర్యంలో విక్రయించి ఆదాయాన్ని పొందనున్నారు. అదేవిధంగా వేరు చేసిన నీటిని శుద్ధి చేసి మొక్కల పెంపకానికి వినియోగిస్తారు. త్వరలో ప్రారంభం పురపాలక ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మానవ మల, మూత్ర వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసే కేంద్రం నిర్మాణం పూర్తి చేశాం. పట్టణంలోని ప్రజల ఇళ్లల్లో సెప్టిక్ ట్యాంకు నిండితే పుర వాహనంలో వ్యర్థాన్ని సేకరించి ప్లాంటుకు తరలిస్తాం. త్వరలో పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి అజయ్‌కుమార్, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభిస్తాం. ఎరువు తయారీకి పురపాలకం చేపడుతున్న పనులకు ప్రజలు సహకరించాలి.

# గ్రామీణులకు వరం.. ఉపాధి హామీ పథకం

మహబూబాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి గ్రామంలోనే ప్రజలకు ఉపాధి కల్పించి, ఆర్థిక భరోసా కల్పించేలా సుమారు 17 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామీణ స్థాయిలో ప్రజలకు పనులు కల్పించడం, కూలీలకు సకాలంలో వేతనాలు అందించడం ఆర్థికంగా ఎదిగేలా ఉపాధిహామీ పథకం ఎంతగానో తోడ్పడుతోంది. గ్రామాల్లో శ్మశాన వాటికలు, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల పెంపకం, మూగజీవాలకు షెడ్ల నిర్మాణం తదితర పనులన్నీ ఈ పథకం ద్వారా అమలు చేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 18 లక్షల పనిదినాలను ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆమోదించారు.

వలసలను నిరోధించేలా...

గ్రామాల్లో సరైన పనులు లేకపోవడంతో ప్రజలు వలస బాట పట్టారు. కరోనా సమయంలో సొంత గ్రామాలకు తిరిగివచ్చిన వలసకూలీలకు



సైతం ఉపాధిహామీ పథకం ప్రధాన ఆధారంగా మారింది. అనుకున్న లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి కూలికి పనులు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

అభివృద్ధి పనులకే మొగ్గు

జిల్లా వ్యాప్తంగా 2023- 24 ఆర్థిక సంవత్సరానికిగాను చేపట్టే ఉపాధిహామీ పనుల్లో భాగంగా గ్రామాభివృద్ధి దృష్ట్యా ఇంకుడు గుంతలు, పశువుల షెడ్ల నిర్మాణం, చెక్ డ్యామ్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నీటి పారుదల కాలువల పూడికతీత, తదితర గ్రామాభివృద్ధికి అవసరమయ్యే పనులను చేపట్టనున్నారు. ఇందుకు గాను మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 75 లక్షలు కేటాయించగా కూలీల చెల్లింపులకు సంబంధించి రూ. 11.32 కోట్ల నిధులను కేటాయించారు. మొత్తంగా రూ. 12.08 కోట్లను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోదించారు.

వందశాతం పూర్తి చేస్తాం

-పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 18 లక్షల పనిదినాలుగా లక్ష్యం నిర్దేశించాం. గ్రామసభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాం. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వందశాతం పనుల లక్ష్యం పూర్తి చేస్తాం.

# అడ్డుకట్ట పడేనా..!




ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు ఏపీకి చెందిన దళారీ వ్యాపారులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అక్కడి రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి.. ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయించేందుకు యత్నిస్తున్నారు. రాత్రివేళల్లో ధాన్యం లారీలను సరిహద్దు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ప్రయత్నిస్తూ ఇటీవల పట్టుబడ్డారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో 3, వేంసూరు మండలంలో రెండు లారీలు ఇలా పట్టుబడ్డాయి. అయినా చెక్‌పోస్టుల వద్ద యంత్రాంగం కళ్లుగప్పి ధాన్యం లారీలు వస్తున్నాయన్న వాదన ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధాన్యం సేకరణ గాడినపడుతున్న వేళ గతానుభవాలూ రైతుల్లో దడ పుట్టిస్తున్నాయి. పటిష్ఠ నిఘా ఏర్పాటు ద్వారా పక్క రాష్ట్రం ధాన్యం రాకకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు.

గతంలో ఇలా..ఏపీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. వారినుంచి తక్కువ ధరలకు ధాన్యం కొనే వ్యాపారులు మన కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో వక్రమార్గం అన్వేషిస్తున్నారు. ఏపీలోని ఎన్టీఆర్, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని గతంలో యథేచ్ఛగా సరిహద్దు కొనుగోలు కేంద్రాలకు తరలించి నిర్వాహకులతో కుమ్మక్కై విక్రయాలు చేపట్టారన్న ఆరోపణలున్నాయి. స్థానిక ఐకేపీ, సహకార సంఘాలు, డీసీఎంఎస్, మార్కెట్ యార్డు కేంద్రాల్లోని కొంతమంది వీరితో కుమ్మక్కై ఈ తంతు సాగిస్తున్నారు. ఈసారీ ఇదే ప్రయత్నాల్లో ఉన్నారనేందుకు పట్టుబడ్డ లారీలే నిదర్శనం.

సరిహద్దు మండలాల్లో..ఏపీ నుంచి ధాన్యం ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తే ఉభయ జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీన్ని నిరోధించేందుకు సరిహద్దు ప్రాంతాలుగా ఉన్న మండలాల్లో అధికారులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 10, భద్రాద్రి జిల్లాలో 6 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం 16 చెక్‌పోస్టుల ద్వారా అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు.

చర్యలు తప్పవు

ఏపీ నుంచి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి విక్రయించకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగంతో నిఘా పెట్టాం. ఏపీ నుంచి ధాన్యం తెచ్చిన వారిపై చర్యలు తప్పవు. మధుసూదన్, అదనపు కలెక్టర్

# మణుగూరు.. వనగూరు



ఖమ్మం :అడవి అంటే జంతు ఒడి.. పచ్చని చెట్లతో, భిన్న వర్ణాల పూలతో, స్వచ్ఛమైన పరిమళాలతో మనసును మురిపించే బృందా'వన'మది.. పక్షుల కిలకిలరావాలకు.. రాగాలకూ గొంతు'కారడవే'. క్రిమికీటకాదుల స్వేచ్ఛా సంచారానికి అరణ్యమే శరణ్యం. వనం చిక్కగుంటేనే అందులో ప్రాణులు చక్కగుంటాయి.. వన్య ప్రాణుల భద్రమైన జీ'వనం'లోనే వైవిధ్యం ఇమిడి ఉంది. మనిషి అవసరాలు శ్రుతిమించి, విలాసాలుగా మారిన వేళ అడవి చిన్నబోతోంది. జీవావరణం మాయమవుతోంది. 'నాగరిక మనిషి' దూరిన అడవిలో చెట్లు మొట్లుగా, నదులు పిల్ల కాలువల్లా మారిపోయాయి. అనుభవమైతేగాని తత్వం బోధపడదన్నట్టు ప్రకృతిలో వచ్చిన 'అకాల' మార్పులు మనలో మార్పులు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోయినచోటే వెతుక్కుంటూ, కోల్పోయిన ప్రకృతి సంపదను పట్టుకునే, రాబట్టుకునే ప్రయత్నం చేస్తోంది మణుగూరు అటవీ యంత్రాంగం. వినూత్న పద్ధతులతో జీవజాలం 'వన'గూరే ప్రయత్నం చేస్తోంది. మణుగూరు అటవీ డివిజన్‌లో పలు రకాల వృక్షాలున్నాయి. వన్య జీవులూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. బొగ్గు గనులు, గోదావరిపై ఆనకట్టల నిర్మాణాలు, విద్యుత్తు కేంద్రాలకు రైలుమార్గం ఇలా అన్నీ అటవీ భూభాగం మీదుగానే విస్తరించాయి. ఇంకా విస్తరిస్తూనే ఉన్నాయి. దీంతో అడవికి, వన్య ప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అటవీ జంతు సంతతిని పెంచేందుకు స్థానిక యంత్రాంగం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వినూత్న పద్ధతులు తెరపైకి తెచ్చింది. గడ్డిజాతి ప్రాణులు, పక్షిజాతుల వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆరు నెలలుగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తూ సానుకూల ఫలితాలు సాధిస్తున్నారు. మణుగూరు డివిజన్‌లో మేకజాతి ప్రాణులు దుప్పి, జింక, కొండగొర్రె, గడ్డి జాతులు కుందేలు, దున్నలు, మనుబోతులు, కుక్క జాతులైన నక్కలు, తోడేలు, గుడ్డేలుగులున్నాయి.

జిల్లాలో ఆరు డివిజన్లు ఉండగా మొత్తం 410 లక్షల హెక్టార్ల అడవి ఉంది. మణుగూరులో 22 వేలు, అశ్వాపురంలో 15, ఏడూళ్లబయ్యారంలో 29 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 79 రకాల వృక్షాలు, 13 రకాల వన్యప్రాణులు, 19 రకాల పక్షి జాతులు ఉన్నాయి.

పక్షి జాతుల కోసం..పక్షి జాతుల కోసం కొలను ఏర్పాటు చేశారు. వెదురు జాతి చెట్లున్న చోట సుమారు 10 హెక్టార్లలో విస్తీర్ణంలో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. కొలను చుట్టూ గడ్డి పెంచి పురుగులు, పాముల సంచారం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పురుగులు వస్తే తొండలు, కప్పలు ప్రవేశిస్తాయి. వాటికోసం పక్షులు వచ్చి వాలుతాయి. వచ్చిన పక్షులు గూళ్లు పెట్టుకునేందుకు వీలుగా వెదురు కర్రలు ఉపయోగపడుతున్నాయి.

వేదిక ఇది..మార్చి నెల నుంచి గడ్డి ఎండిపోతుంది. దీంతో ఆహారం దొరక్క చాలా ప్రాణులు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఆహారం అందించటానికి గడ్డి పెంపకం చేపట్టారు. మణుగూరు మండలం బుగ్గ పరిసరాలను వేదికగా ఎంచుకున్నారు. జంతువుల కోసం..అటవీ డివిజన్‌లో మూడుచోట్ల సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆరు బోర్లను వేసి కొలనులు నిర్మించారు. నిరంతరాయంగా బోరు నీరు కొలనులో చేరుతుంది. ఇదే ప్రాంతంలో ఫైబర్ ఎక్కువగా ఉండే గడ్డి విత్తనాలు చల్లారు. గడ్డికి నీరు అందడం వల్ల ఏపుగా పెరిగింది. దీన్ని తిని, నీరు తాగి జంతువులు ముందుకెళున్నాయి. వేసవిలో జంతువుల అలసట తీర్చటంలో భాగంగా గడ్డి విస్తరించిన ప్రాంతాల్లో ఉప్పుతో కలిపిన రేగడి మట్టి గుంతలు ఏర్పాటు చేశారు. జంతువులు ఈ మట్టిని నాకడం ద్వారా లవణాలు అందుతాయి. "మణుగూరు అడవి గుండాల, కిన్నెరసాని, అశ్వాపురం ప్రాంతాల వరకూ విస్తరించి ఉంటుంది. మొత్తంగా వనం కుదింపునకు గురవటంతో పునరుత్పత్తి (రీజనరేషన్) తప్పనిసరైంది. ఇక్కడ బొగ్గు గనుల విస్తరణతో వేల హెక్టార్లకు నష్టం వాటిల్లింది. బుగ్గ ప్రాంతంలో నేలపై పడ్డ విత్తనాలు అగ్గికి కాలిపోకుండా కాపాడి మొక్కలు చేశాం. ఆ మొక్కలు జంతువులకు ఆహారంగా మారాయి. వాటి రక్షణకు శ్రీకారం చుట్టాం."

సయ్యద్ మక్సూద్ మొయినుద్దీన్, ఫారెస్టు డివిజనల్ అధికారి

"వేసవిలో గడ్డికొరతను గుర్తించి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పెంచుతున్నాం. కొన్ని వన్య ప్రాణుల రాక మొదలైంది. భవిష్యత్తులో మరో ఐదురకాల గడ్డి జాతులు పెంచాలని అనుకుంటున్నాం. "ద్వాలియా, రేంజ్ అధికారి, మణుగూరు.

# ఆదాయ గని

ఖమ్మం : గ్రావెల్, స్టోన్‌మెటల్ వినియోగం, విక్రయాలు రెండేళ్లలో రెట్టింపు అయ్యాయి. దీంతో గనుల శాఖ ఆదాయం భారీగా పెరుగుతోంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఖమ్మం-కోదాడ రోడ్డు నిర్మాణం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రావెల్, స్టోన్‌మెటల్ వినియోగం ఎక్కువైంది. ఉపాధి పథకంలో పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టారు. దీంతో స్టోన్ మెటల్ వాడకం పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గనుల శాఖకు ఆదాయం మరింత పెరగనుందని అంచనా. గనుల తవ్వకానికి లీజు అనుమతులు అధిక సంఖ్యలో మంజూరు చేసినా, మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగా ఆయా ఖనిజాల తవ్వకాన్ని చేపడుతుంటారు. చాలా ఖనిజాల తవ్వకానికి అనుమతులు పొందిన వారు చాలా మంది క్వారీ తవ్వకాలు చేయటంలేదు. గ్రానైట్ క్వారీల నుంచి 2021-22లో 34 వేల ఘనపు మీటర్ల ముడి రాయి వెలికి తీసేందుకు అనుమతివ్వగా 22-23లో 33వేల ఘనపు మీటర్లకు అనుమతులిచ్చారు. క్వారీల్లో గ్రానైట్ ముడిరాయి లభ్యత తగ్గింది. గ్రానైట్ పరిశ్రమల్లో పాలిష్ చేసిన గ్రానైట్ పలకలు 2021-22లో 2.46 లక్షల చదరపు అడుగుల రవాణాకు అనుమతులివ్వగా, 2022-23లో 2.84 లక్షల చదరపు అడుగులకు పర్మిట్ ఇచ్చింది. "ఏటా ఆదాయం పెంచాల్సిన బాధ్యత మాపై ఉంది. గత సంవత్సరంలో రూ. 75.04 కోట్లు ఆదాయం లభించింది. ఈ ఏడాది పెరగాలి. గతేడాది 492 కేసులు నమోదు చేసి అపరాధ రుసుం రూపంలో రూ. 64.25 లక్షలు వసూలు చేశాము."సంజయ్‌కుమార్, గనుల శాఖ ఏడీ, ఖమ్మం

# లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి!

మహబూబాబాద్ : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దాహాన్ని తీర్చుకునేందుకు మనుషులే కాదు మూగ జీవాలు సైతం అల్లాడుతున్నాయి. మేతకు వెళ్లిన జీవాలు నీరు దొరకక అలమటిస్తున్నాయి. ఇంటికి వచ్చే వరకు వాటికి నీరు దొరకడం లేదు. వేసవికాలంలో పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టారు. వాటి నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. పలు చోట్లలో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల దాహార్తిని తీర్చేందుకు దాదాపు 1000 పశువుల నీటి తొట్టెలను నిర్మించారు. ఒక్కో నీటి తొట్టికి రూ. 20వేల వరకు వెచ్చించారు. ఈ నీటితొట్టెలకు పంచాయతీల ఆధ్వర్యంలో నీటి సరఫరా అందించి పశువుల దాహార్తిని తీర్చడానికి నిర్మించగా అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా అవి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం ఎండల కారణంగా చెరువుల్లో, వాగుల్లో, కుంటల్లో నీరు అడుగంటిపోతోంది.. బయటకు వెళ్లిన పశువు ఇంటికి వచ్చేదాక నీరు దొరకని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో నిర్మించిన తొట్టెలలో నీరు నింపకపోవడంతో మూగజీవాలు ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నాయి.



మూగరోదన..

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలు వివిధ కారణాలతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఫలితంగా నోరు తెరచి అడగలేని ఆ జీవాలు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. అవసరం లేని ప్రదేశాల్లో, నీటి జాడలేని స్థలాల్లో నీటి తొట్టెలను నాసిరకంగా నిర్మించి రూ.లక్షల నిధులు వెచ్చించారు. వాటికి పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరా చేయాల్సి ఉండగా ఎవరు పట్టించుకోవడం లేదు. నీటి జాడను తెలుసుకునేందుకు పాడి రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దాహార్తితో అలమటిస్తున్న మూగ జీవాలకు రోదన తప్పడం లేదు.

నీళ్లు నింపేలా చర్యలు తీసుకుంటాం..

-ఆశాలత, డీపీఓ, భూపాలపల్లి జిల్లా

గ్రామాల్లో నిరుపయోగంగా మారిన నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకొస్తాం. తొట్టెలు ఉన్న చోట్ల నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం. నీటి కొరత కారణంగా కొన్ని తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం లేని చోట ట్యాంకర్‌తో నింపించేలా ఎంపీవోలకు ఆదేశాలు జారీ చేస్తాం. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీరుస్తాం.

# పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు

మహబూబాబాద్ : విద్యార్థుల్లో చదువుతోపాటు జీవన నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా పలు కార్యక్రమాలు చేపడుతోంది. సమగ్ర శిక్ష పథకంలో భాగంగా విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు నేర్పించేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పలు ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే ఈ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. 2020 నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా సెకండరీ, హయ్యర్ సెకండరీ విద్యలో వృత్తి విద్యా కోర్సులను అమలు చేస్తున్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆదర్శ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం అమలవుతోంది.

మరిన్ని బడులకు విస్తరణ

ఈ విద్యా సంవత్సరంలో ధర్మకంచ, శివునిపల్లి, పాలకుర్తి జడ్పీహెచ్ఎస్‌లో ఈ కోర్సులను ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది జిల్లాలోని మరో 3 ప్రభుత్వ బడులతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ కస్తూర్బా విద్యాలయాల్లో అమలు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు




సమాచారం. ప్రతి పాఠశాలలో రెండు కోర్సులు ఉంటాయి, ఒక్కో కోర్సుకు రెండేళ్ల వ్యవధి ఉంటుంది. వచ్చే ఏడాది మరిన్ని బడులకు ఈ కోర్సులను విస్తరించనున్నారు.

విద్యార్థులకు మంచి అవకాశం: శ్రీనివాస్, ఏఎంవో, జనగామ

ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నైపుణ్యం చూపితే భవిష్యత్తులో ఉపాధి కూడా పొందగలుగుతారు. తమ కాళ్లపై తాము నిలబడగలుగుతారు. భవిష్యత్తులో విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కోర్సులను అమలు చేస్తోంది.

బోధన విధానం ఇలా..ఈ పథకంలో ఒక్కో వృత్తి విద్యా కోర్సుకు వారానికి మూడు పీరియడ్లు కేటాయిస్తారు. ఈ లెక్కన రెండు కోర్సులకు వారానికి ఆరు పీరియడ్లు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక కన్సల్టెన్సీలతో వీటిని అమలు చేస్తున్నా రు. ఇప్పటికే ప్రతి బడికి ఇద్దరు శిక్షకులను కూడా నియమించారు. వ్యవసాయం, అప్పారెల్, ఆటోమోటివ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఐటీ అండ్ ఐటీఈఎస్, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, రిటైల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, ప్లంబర్ తదితర కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 8 ఆదర్శపాఠశాలల్లో ఈ కోర్సులను అమలు చేస్తున్నారు.

# మూడేళ్లయినా.. ముందుకు సాగలే

కరీంనగర్ : ధర్మపురి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి.. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో రూ.140 కోట్ల విలువైన అభివృద్ధి పనులను మంజూరు చేయించినా గుత్తేదార్ల నిర్లక్ష్యం, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ముందుకు సాగడం లేదు. ఈ పనులు మూడేళ్ల కిందట ప్రారంభించినా ఇప్పటివరకు సగం మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పనులను పూర్తి చేయడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. ధర్మపురి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మొత్తం రూ.140 కోట్ల వరకు ప్రతిపాదనలను పంపించగా, వాటిలో నగరం ప్రారంభమవగా, వీటిలో సగం మాత్రమే పూర్తయ్యాయి. పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రధాన వీధుల్లో 60 అడుగులతో రహదారి వెడల్పుతో రహదార్లను విస్తరించారు. మురుగు కాల్వల నిర్మాణాలు చేపడుతున్నారు.



పనులు ఇలా..లి పీఆర్, ఆర్అండ్‌బీ, మున్సిపల్‌కు చెందిన రూ.65 కోట్ల పనులు చేపట్టగా, వీటిలో సగం వరకు పూర్తయ్యాయి.

లి వివేకానంద నుంచి పటేల్ విగ్రహం, పటేల్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహ కూడలి, గాంధీ నుంచి నంది విగ్రహ కూడలి వరకు, బస్టాండ్ నుంచి హన్మాన్ విగ్రహ కూడలి వరకు 60 అడుగులతో రహదారి విస్తరణ పూర్తి చేశారు. ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టారు.

లి రూ.2 కోట్లతో శ్మశాన వాటిక, రూ. 2 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయి. కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. ఒకటి రెండు చోట్ల రహదారి విస్తరణపై స్థానికులు కోర్టును ఆశ్రయించడంతో ప్రారంభించలేదు.

లి హరితహోటల్ వరకు దాదాపు విస్తరణ పూర్తయినా ఒకటి రెండు చోట్ల నిలిచిపోయాయి. తెనుగువాడ నుంచి బ్రాహ్మణ సంఘం వరకు ప్రగతి దశలో ఉండగా, రామాలయం, తెలుగు కళాశాలను కలిపే పనులు పూర్తి దశలో ఉన్నాయి.

లి ఎస్సారెస్పీ కాలువ గట్టు నుంచి మార్కెట్‌యార్డు, జాతీయ రహదారి వరకు నిర్మాణం పూర్తయింది. పటేల్ విగ్రహ, నంది, గాంధీ విగ్రహ కూడళ్ల సుందరీకరణ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

లి విద్యుత్తుశాఖ, ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి.

లి పట్టణంలోని పలు చిన్న గల్లీల్లో ఇంకా సీసీ రహదార్ల నిర్మాణాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టడం లేదు. కొన్ని చోట్ల పనుల్లో నాణ్యత అంతంతమాత్రంగానే ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

లి పుర కమిషనర్ సిహెచ్ రమేష్ మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు సుమారుగా 70 శాతం పూర్తయ్యాయని, పెండింగ్ పనులపై త్వరలోనే క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ వారితో పరిశీలన చేసి చర్యలు చేపడుతామని చెప్పారు.

# వ్యర్థానికి అర్థం.. హరితానికి మార్గం

కరీంనగర్ : 'చెత్త నుంచి సంపద తయారీ' నినాదంతో ఏర్పాటైన సెగ్రిగేషన్ షెడ్లు(చెత్త వర్గీకరణ షెడ్లు) నిరుపయోగంగా మారాయని మొదట్లో విమర్శలు వచ్చినా.. తర్వాత కొద్ది రోజులకు లక్ష్యం సాధించే దిశగా వాడుకలోకి వచ్చాయి. ప్లాస్టిక్ కవర్లు, ఇతరత్రా వ్యర్థాలను డంపింగ్ యార్డులకు పంపిస్తూ మిగతా చెత్తను వర్గీకరించి షెడ్డుకు తరలిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో 266 పంచాయతీలుండగా పలు చోట్ల చెత్త వర్గీకరణ ప్రక్రియ సత్ఫలితాలిస్తోంది. సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీ కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేశారు. శ్రద్ధ చూపుతున్న పంచాయతీల్లో రెండు నెలలకోసారి ఎరువు తయారవుతుండగా, ఒక్కో చోట నాలుగు నెలల వరకూ సమయం పడుతోంది.

మెండుగా పోషకాలు

వర్మీ కంపోస్టులో మొక్కల ఎదుగుదలలో కీలకమైన సేంద్రియ కర్బనం 25 శాతం వరకు ఉంటుంది. నత్రజని, భాస్వరం, పొటాషియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, రాగి, జింక్ పోషకాలు మిళితమై ఉంటాయి. ఈ ఎరువు వినియోగంతో నేల గుల్ల బారుతుంది. నీటిని నిల్వ చేసుకునే స్వభావం పెరుగుతుంది. తద్వారా మొక్కలు ఏపుగా పెరుగుతాయి. ఈ ఎరువును కోళ్లు, చేపలకు ఆహారంగానూ అందించవచ్చు.

కాస్త చొరవ.. లక్ష్యానికి చేరువ

అన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లున్నాయి. అయితే పంచాయతీల్లో సరిపడా సిబ్బంది లేరు. ఉన్న వారిలో ఒకరిని చెత్త నిర్వహణ కోసం కేటాయించిన చోట ఇంటింటి నుంచి చెత్త సేకరణతో పాటు సెగ్రిగేషన్ షెడ్డు నిర్వహణ మెరుగ్గా ఉంది. పెద్ద పంచాయతీల్లో సిబ్బంది ఎక్కువగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేదు. తక్కువ జనాభా ఉన్న పంచాయతీల్లోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులపై పని భారం పెరుగుతోంది. చాలా చోట్ల నీటి వసతి లేదు. ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ చూపితే ప్రభుత్వ లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరుతుంది.

చెత్తతో పాటు పశువుల పేడ

నర్సింగాపూర్ పంచాయతీ పరిధిలో పోగయ్యే చెత్తతో పాటు పల్లె ప్రకృతివనంలో తొలగించే గడ్డిని, అడ్డదిడ్డంగా పెరిగే మొక్కలను వర్మీ కంపోస్టు తయారీకి వినియోగిస్తున్నారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలకు, రహదారి వెంట నాటిన మొక్కలకు కంపోస్టును వేస్తున్నారు. దీంతో ప్రకృతివనంలో మొక్కలు ఏపుగా పెరిగి పూలు పూస్తుండగా బతుకమ్మ పండుగ, ఇతర అవసరాలకు గ్రామస్థులు అక్కడి నుంచి సేకరిస్తున్నారు. ఊళ్లో పోగు చేస్తున్న చెత్తతో పాటు పశువుల పేడనూ వినియోగిస్తున్నామని కార్యదర్శి సాగర్ తెలిపారు. యూనిట్లపై రోజూ నీటిని చల్లుతున్నామని చెప్పారు.

21 వేల మొక్కలకు ఆదరువుపత్తిపాకలో చెత్త సేకరణ పకడ్బందీగా అమలవుతోంది. సేకరిస్తున్న చెత్తను వర్గీకరించి, ప్లాస్టిక్ కవర్లు మినహా అన్నింటినీ వినియోగించుకుంటున్నారు. తడి చెత్తను వర్మీ కంపోస్టు తయారీకి వినియోగిస్తున్నారు. ఇక్కడి సెగ్రిగేషన్ షెడ్డులోని రెండు అరల్లో వర్మీ కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేశారు. రెండు నెలలకోసారి ఎరువు తయారవుతోందని పంచాయతీ కార్యదర్శి సంజీవ్ తెలిపారు.

# అన్నదాతకు అండగా కిసాన్ సమ్మాన్ నిధి



కరీంనగర్ : ఆరుగాలం శ్రమను నమ్మిన అన్నదాతకు కిసాన్ సమ్మానిధి రూపంలో ఆర్థిక సాయం అందుతోంది. జిల్లాలోని రైతులకు సంబంధించి 11వ విడత సాయాన్ని కేంద్ర సర్కారు గడిచిన రెండ్రోజులుగా రైతుల ఖాతాల్లోకి జమచేస్తోంది. రూ. 2వేల చొప్పున ఏడాదికి మూడు సార్లు అందించే ఈ తోడ్పాటుతో కర్షకులకు ఒకింత భరోసా కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయానికి తోడుగా ఈ నిధి దరిచేరడంతో రైతన్నల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,04,094 మందికి ఈ నగదు రైతుల ఖాతాల్లోకి జమైంది. మిగతా మరో 8వేల మంది వరకు ఇంకా ఈ పథకానికి సంబంధించిన సొమ్ము అందాల్సి ఉంది. గతంతో పోలిస్తే ఈ పథకంలో అసలైన అర్హులకే ఈ మొత్తం అందేలా పారదర్శకతను పెంచుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారిని గుర్తిస్తూ జాబితాలో నుంచి తొలగిస్తున్నారు. ఇదే సమయంలో అసలైన సన్న,చిన్నకారు రైతులు పక్కాగా ఉన్న వారికి చోటు కల్పిస్తూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని అక్కున చేరుస్తున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల వారికి మేలు చేసేలా ఇది వరంగా మారుతోంది. పెరుగుతున్న సంఖ్య..జిల్లాలో ఈ పథకం ప్రారంభమైన మొదట్లో 71,141 మంది రైతులకు మొదటి దఫా సాయాన్ని అందించారు. డిసెంబరు 2018 నుంచి మార్చి 2019 కాలానికిగానూ రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం అందించే సొమ్ము రూ.2వేల చొప్పున ఖాతాల్లో వేశారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి జిల్లాలోని లాభోక్తుల సంఖ్య 1,12,108కి పెరిగింది. అంటే 40,967 మంది రైతులు పెరిగారు. కొత్తగా భూమి కొనుగోలు చేసిన వారితోపాటు గతంలో సాంకేతిక కారణాలతో ఇక్కట్లు పడిన వారు మలిదఫా ప్రయోజనాల్ని అందుకున్నారు. గడిచిన రెండ్రోజుల కిందట జిల్లాలోని రైతులు 1.04లక్షల మందికి నగదు వారి ఖాతాల్లోకి పడింది. మరో 8వేలకుపైబడిన అన్నదాతలకు ఈ వారం రోజుల్లో నగదు జమయ్యే అవకాశమున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య మరింతగా పెరిగే వీలుంటుందన్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి అందే సాయం విషయంలో లాభోక్తుల సంఖ్య ఇంతకింతకు పెరుగుతుండటం గమనార్హం.!

66శాతం అనుసంధానం..జమయ్యే నగదుతో సంబంధం లేకుండా కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారుల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానించే ప్రక్రియ జిల్లాలో నిదానంగానే సాగుతోంది. వాస్తవానికి మే నెల 31 తేదీ వరకు గడువును గతంలో నిర్ణయించినా.. అన్ని మండలాల్లో కలిపి 60శాతం మాత్రమే నమోదు దిశగా ఆసక్తిని చూపించారు. ఈ నెల 3వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా ఈ పురోగతి 66 శాతానికి చేరింది. ఆధార్ నమోదు చేసుకోవాల్సిన వారి సంఖ్య 91,701 మంది ఉండగా ఇప్పటి వరకు 60,960 మంది మాత్రమే ఆసక్తిని కనబర్చారు. ఇంకా 34 శాతం మంది ఈ దిశగా అడుగులేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కేవైసీ నమోదు ప్రక్రియకు మరింత సమయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది. జులై 31వ తేదీ వరకు ప్రతి లబ్ధిదారు ఆన్‌లైన్‌లో సరైన సమాచారం పొందుపర్చడంతోపాటు అనుసంధానానికి చొరవ చూపాల్సిన అవసరముంది. ఇప్పటికే ఆయా క్లస్టర్ల పరిధిలో ఏఈవోలు రైతుల నుంచి వివరాలు సేకరిస్తూ వారి వివరాల్ని నమోదు చేస్తున్నారు. ఇంకొంత మంది మీసేవలో వివరాల్ని పొందుపర్చుకుంటున్నారు. వందశాతం అన్నదాతల్ని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చొరవను చూపిస్తున్నారు.

# ఆరేళ్లుగా అరకొర సిబ్బందే



కరీంనగర్ : పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనను చేపట్టింది. ప్రజలకు దూరాభారం తగ్గించాలనే ఉద్దేశంతో కొత్తగా మండలాలను ఏర్పాటు చేసింది. 2016 అక్టోబర్‌లో నూతన మండలాలు, జిల్లాలను అట్టహాసంగా ప్రారంభించింది. ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికి సిబ్బందిని కేటాయించకపోవడంతో అనుకున్న మేర అభివృద్ధి జరగడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇన్‌ఛార్జి అధికారులు ఎప్పుడు వస్తారో ఎక్కడుంటారో తెలియక జనాలు నానా ఇబ్బందులు పడుతున్నారు.వీర్నపల్లిని అప్పటి కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. మంత్రి కేటీఆర్ సైతం పలుమార్లు అటవీ గ్రామాలకు ఉప కేంద్రంగా వీర్నపల్లిని మార్చుతామని ప్రస్తావించారు. ఇచ్చిన హామీ ప్రకారం 2016 సంవత్సరంలో సిరిసిల్ల జిల్లాతోపాటు వీర్నపల్లి మండలాన్ని ఆరు గ్రామాలతో కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పల్లెల సంఖ్య 17కు చేరింది. ఈ ఊర్లలో సుమారు 20 వేల వరకు జనాభా ఉన్నారు.

ఇదీ పరిస్థితి

మండలంతోపాటు గ్రామాలు అభివృద్ధి చేయాలంటే అన్నిశాఖల అధికారులు సమన్వయం తప్పనిసరి. ఏదైనా శాఖకు చెందిన అధికారి లేకుంటే ఆ శాఖ పరిధిలో జరిగే అభివృద్ధి కుంటుపడుతుంది. దీంతో ఆ ప్రభావం పల్లెలు, జనాలపై పడుతుంది. ప్రభుత్వం విద్యతోపాటు వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుంది. 2015 సంవత్సరంలో వీర్నపల్లికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరయింది. అద్దె గదిలో కేంద్రాన్ని నడిపిస్తే ఇక్కడి జనాలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వైద్యాధికారులు, ఏఎన్ఎంలతో సిబ్బందిని నియమిస్తే ఈ ప్రాంతవాసులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. మండలానికి విద్యాధికారి లేకపోవడంతో పాఠశాలల పర్యవేక్షణలో జాప్యం జరుగుతుంది. దీంతో ఉపాధ్యాయుల్లో సమయపాలన లోపిస్తుంది. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సూచనలు చేయడం ఇబ్బందే. అలాగే పాఠశాల సముదాయానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు ఈ బాధ్యతలను చూసుకోవాల్సి వస్తోంది. ఉపాధి హామీ పథకంతో వివిధ రకాల ప్రజాయోజన పనులను చేపడుతుంటారు. వ్యవసాయ రంగంతోపాటు కూలీలకు ఉపాధి కల్పిస్తుంటారు. వీటన్నింటిని మండల స్థాయిలో ఏపీవో పర్యవేక్షణ చేస్తుంటారు. కోనరావుపేట, వీర్నపల్లికి ఒకే అధికారి ఉండటం, సాంకేతిక సహాయకులు ఇద్దరే ఉండటంతో కొంత ఇబ్బంది ఏర్పడుతుంది.

గ్రామాల్లో అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు పీఆర్ ఏఈ లేరు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లికి ఒకే ఏఈ ఉండటంతో ఎం.బుక్ రికార్డు చేయడంలో జాప్యం జరుగుతుంది.

మండలానికి వ్యవసాయాధికారి, వెటర్నరీ అధికారితోపాటు సిబ్బందిని నియమించలేదు.

వీర్నపల్లికి సెస్ ఏఈతోపాటు కార్యాలయం లేదు. ఇన్‌ఛార్జి ఏఈ చరవాణికి స్పందించరనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎవరికి సమస్యలు విన్నవించాలో తెలియక జనాలు అవస్థలు పడుతున్నారు. కార్యాలయం లేకపోవడంతో ఎల్లారెడ్డిపేటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యానవనం, నీటిపారుదల, మత్స్యశాఖ, ఎక్సైజ్ ఇలా పలు శాఖలకు బాధ్యులు లేకపోవడంతో మండల వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అన్ని శాఖలకు అధికారులను నియమించాలి– బొంగు తిరుపతి, యువకుడు, బంజేరు

వీర్నపల్లి మండలం ఏర్పాటై ఆరు సంవత్సరాలు గడుస్తుంది. ఇప్పటికి ఇన్‌ఛార్జి అధికారులతోనే పాలన కొనసాగుతోంది. కొన్ని కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది లేరు. దీంతో మండలం అభివృద్ధిలో వెనకబడే అవకాశం ఉంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎవరికి, ఎక్కడ విన్నవించాలో తెలియని పరిస్థితి ఉంది. జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని మండల అధికారులను నియమించాలి. ఉన్నవారు కార్యాలయాల్లో సమయానుగుణంగా అధికారులు రారు. దీంతో జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

# నిండుగా జలం.. రైతన్నకు ఫలం

జగిత్యాల : యాసంగి పంటకాలం, వేసవి సీజను ముగిసి వానాకాలం పైర్లసాగు తరుణంలో జిల్లాలోని మండలాల్లో అందుబాటులోఉన్న భూగర్భ జలాలు అన్నదాతలకు ఆశాజనకంగా మారాయి. 2021 మే నెలాఖరున 5.89 మీటర్ల లోతుతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు మరింత పైనే 5.81 మీటర్ల సరాసరి లోతులో ఉండటం పంటల సాగుకు దన్ను కలిగింది.ఎస్సారెస్పీ నుంచి జిల్లాలోని ఆయకట్టుకు ఏప్రిల్ వరకు నీటిని వదలగా ప్రాజెక్టు నుంచి వరద కాలువలోకి కూడా పలు దఫాలుగా నీటిని విడుదల చేశారు. దీంతోపాటుగా కాకతీయ, వరదకాలువలు, ఇతర డిస్ట్రిబ్యూటరీల నుంచి కూడా చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేయటంతో వేసవి ముగిసినా చాలా నీటివనరులు జలంతోనే నిండి ఉన్నాయి. చాలా వరకు వాగులు, ఒర్రెల్లోనూ నీరు పారుతుండగా భూగర్భ జలమట్టం పైపైనే కొనసాగుతోంది. ఎస్సారెస్పీ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.068 టీఎంసీల నీరు నిలువుంది. దీంతోపాటుగా వరదకాలువలోనూ నీరు ఉండటం, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఎల్లంపల్లి నుంచి జలాలను ఎత్తిపోసి వరద కాలువలో నిండుగా నిల్వచేసే వీలుండటం, సగటు భూగర్భ జలమట్టం 5.81 మీటర్లుగా ఉండటం వానాకాలం పైర్లసాగుకు కలిసిరానుంది. కాలువలతో పాటుగా బావులు, బోర్లలోనూ సమృద్ధిగా నీరుండగా మోటార్లద్వారా నీటిని తోడుకునే వీలుండటంతో వరినార్లకు అవకాశం కలిగింది. ప్రస్తుతం జిల్లాలోని మండలాల్లో కనిష్ఠ స్థాయిలో భూగర్భ జలాలుండటంతో జిల్లాలోని 1.26 లక్షల పంపుసెట్ల ఆధారితంగా పంటల సాగుకు అవకాశం ఏర్పడిందని భూగర్భ జలవనరులశాఖ జిల్లా అధికారి జి.నర్సింహులు తెలిపారు.లి సాగునీటి లభ్యతతో జిల్లాలో ఈ వానాకాలంలో 4.42 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యాన పంటలు సాగులోకి వస్తాయని అధికారులు అంచనా వేయగా ఇందులో అత్యధికంగా 2.80 లక్షల ఎకరాల్లో వరి పంట వేయనున్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వరి రకాలతో రైతులు నార్లు పోయనుండగా ఇప్పట్నుంచి జులై నెలాఖరు వరకు పెద్దఎత్తున వరినార్లు పోసి సెప్టెంబరు వరకు నాట్లు వేస్తారు కాబట్టి వీరికి జల లభ్యత ఎంతో ఉపయుక్తంగా మారనుంది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలతో ప్రాజెక్టుల నీటి లభ్యత, భూగర్భ జలాల అందుబాటుతో రైతులు వానాకాలం పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతుండగా ప్రకృతి కరుణించి సమృద్ధి వర్షాలు కురియటం, ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతలు సిద్ధిస్తే ఈ వానాకాలంలోనూ జిల్లా రైతులు మెండైన పంటలను పండించగలుగుతారు.

# పూడిక పేరుకుంటోంది..!

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో నగరానికి అనుకొని ఉన్న ప్రధాన వరదకాల్వల విస్తరణ, నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులు కొనసాగుతుండగా అంతర్గత వీధుల్లో మురుగునీటి కాల్వలను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలనీల్లోంచి వచ్చే వరద, మురుగునీరంతా ఈ కాల్వల గుండానే వరదకాల్వల్లోకి చేరుతోంది. అలాంటి డ్రైనేజీల్లో చెత్తాచెదారం, రాళ్లు, రప్పలు పేరుకుపోయాయి. ఏటా వర్షాకాలంలో వరదకాల్వల్లో పూడికతీత పనులు చేయిస్తుండగా ఈసారి నిర్మాణ పనులు చేస్తుండటంతో టెండర్లు పిలవలేదు. వీధుల్లోని మురుగునీటి కాల్వలు మాత్రం కార్మికులతోనే శుభ్రం చేయించాల్సి ఉండగా ఆ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. వర్షాలు ముందస్తుగా వస్తాయని వాతావరణ శాఖ చెబుతుండగా ఆ దిశగా కార్యాచరణ తీసుకోవాల్సిన అవసరముంది. మూసుకుపోతున్న ఛాంబర్లు నగరంలోని పలు ప్రాంతాల్లో గత మూడేళ్లుగా బహిరంగ కాల్వల నిర్మాణానికి బదులుగా పైపులైను వేస్తున్నారు. ప్రతీ వంద మీటర్లకు ఒక ఛాంబర్ ఇస్తుండగా రోడ్డుపై పడిన వర్షం నీరంతా ఇందుల్లోకే వచ్చేలా నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆయా ఛాంబర్లు మూసుకుపోతున్నాయి. పైపులైన్‌లో మట్టి, పూడిక నిండి ఉంది. వర్షాలు కురవకముందే డివిజన్ల వారీగా వీటిని సైతం శుభ్రం చేయిస్తే వరదనీరు నేరుగా కాల్వల గుండా వెళ్లే అవకాశముంటుంది.

డివిజన్ల వారీగా ప్రత్యేక డ్రైవ్ ముంచుకొస్తున్న వర్షాకాలాన్ని దృష్టిలో



ఉంచుకొని డివిజన్ల వారీగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. అంతర్గత కాల్వలు, ప్రధాన కాల్వలు అనుసంధానంగా ఉన్నాయో లేదో గుర్తించాలి. ప్రతీ వీధిలో డ్రెయిన్ శుభ్రంగా ఉండేలా నీరు నిలవకుండా చూడాలి. అధికారులు పరిశీలించి వర్షాలు పడకముందే కార్యాచరణ ప్రారంభించాలి.రహదారుల వెంట..ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాల్వలను శ్లాబులతో కప్పేశారు. నిర్మాణ సమయంలోనే వాటిని శుభ్రం చేయాల్సి ఉండగా అలాగే వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ కాల్వల గుండా నీరు ప్రవహించకుండా వరద నీరు రోడ్డుపైకి వస్తోంది. గత రెండేళ్లుగా వీటిలో పూడిక తొలగించాలని ఆదేశాలు ఇస్తుండగా ఆర్అండ్‌బీ, నగరపాలక రెండూ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసిన మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఛాంబర్ నుంచి ఛాంబర్ వరకు తెరిచి ఎక్కడ ఎంతమేర మురుగు పేరుకుపోయిందో గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. అంతర్గత వీధుల్లోని కాల్వల్లో పూడిక తొలగిస్తే ఆ కాల్వలు లోతుగా ఉండి నీరంతా రోడ్ల మీదికి రాకుండా ప్రవాహంతో వెళ్లే అవకాశం ఉంటుంది. పూడికతీత పనులు చేపట్టకపోవడం, ఇన్నాళ్లూ వరదకాల్వలకే పరిమితం కావడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. రోడ్డుపై వర్షపు నీరంతా నేరుగా కాల్వల్లోకి వెళ్లేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం : – వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్‌పట్టణ ప్రగతి కార్యక్రమంలో వరదనీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఓపెన్ డ్రైనేజీలు ఉన్న చోట పూడిక తీయిస్తాం. అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తాం.

# ప్రమాదాలకు 'హోర్డింగ్'

కరీంనగర్ : గాలి దుమారం ఏ సమయంలో వస్తుందో తెలియదు.. ఒక్కసారిగా ప్రకృతి తన ప్రతాపాన్ని చూపిస్తే నగరం అతలాకుతలం కావాల్సిందే.. అడ్డూ అదుపు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలతో ఇబ్బందులు ఎదురవుతున్నా..గంటల తరబడి విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోతున్నారు. కనీసం వర్షాకాలంలో ముందస్తు చర్యలు కూడా కనిపించడం లేదు.జిల్లా కేంద్రంలోని నగరపాలికతో పాటు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై పెద్ద, పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రచార బోర్డులు ఏర్పాటు చేసే సమయంలో కనీస నిబంధనలు పాటించాలి. భవనానికి, విద్యుత్తు తీగల మధ్య ఎంత దూరం ఉండాలనే విషయం తెలిసినప్పటికీ అవేవి కనిపించడం లేదు. ప్రస్తుతం ఎండాకాలం నుంచి వర్షాకాలం ప్రారంభం అవుతుండటంతో గాలి దుమారం, ఈదురుగాలులు వీస్తున్నాయి. నగరంలో ఎక్కువ సంఖ్యలో ప్రచారబోర్డులు ఖాళీగా ఉండగా, ఉన్నచోట మాత్రం విద్యుత్తు తీగలకు ఆనుకొని ఉండటం, గాలి వచ్చిన సమయంలో బిగించి ఉన్న ఫ్లెక్సీలు చినిగిపోవడం, తీగలపై పడుతుండటంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

చర్యలు చేపట్టాలి..నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై రెండు వైపులా విద్యుత్తు స్తంభాలు, తీగలు, నియంత్రికలు ఉన్నాయి. ఇందులో 33, 11కెవి, ఎల్‌టీ లైన్లు ఉన్నాయి. వీటికి దగ్గరే ఉంటున్న భవనాలపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్తు తీగలకు అతి దగ్గర ఉండటంతో గాలి వచ్చిన సమయంలో ఫ్లెక్సీలు చినిగి విద్యుతు తీగలు, స్తంభాలపై వేలాడుతున్నాయి. శుక్రవారం వేకువజామున వీచిన గాలికి పలు చోట్ల ఫ్లెక్సీలు చినిగి విద్యుత్తు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర మంత్రి ఇంటికి ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభానికి అయితే ఫ్లెక్సీ చుట్టుకుంది. ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదురుగా విద్యుత్తు తీగలపై ఫ్లెక్సీలు పడి గాలికి ఊగులాడటం కనిపించింది. రోడ్ల మీద కర్రలతో ఫ్లెక్సీలు కడుతుండగా గాలికి పడిపోతున్నాయి. ఆ సమయంలో రాకపోకలు సాగించే ప్రజలపై పడితే ప్రమాదం జరిగే అవకాశముంటున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా నగరపాలక, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రంగంలోకి దిగి ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భవనాల నాణ్యత ఉన్నట్లేనా?ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాలను ఎంచుకొని ప్రచార బోర్డులు ఏర్పాటు చేస్తుండగా ఏ ఏడాదికి ఆ ఏడాది భవన సామర్థ్యం ఏవిధంగా ఉందనే విషయాన్ని ఎవరూ గుర్తించడం లేదు. రహదారులకు ఆనుకొని ఇళ్లు ఉంటే చాలు ఆయా సంస్థలు ముందుకొచ్చి హోర్డింగ్‌లు, టవర్లు బిగిస్తున్నారు. ఆరేళ్ల కిందట కరీంనగర్‌లో ఓ భవనంపై నిర్మించిన సెల్ టవర్ దిమ్మెలతో సహా కూలిపోయి ంది. అయితే ఈ మధ్య నిర్మిస్తున్న భవనాల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. నిర్మాణ సమయంలో క్యూరింగ్ చేయడం లేదు. పైగా బోర్డుల కోసం ఏర్పాటు చేసే దిమ్మెల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భవనాల నాణ్యతను తనిఖీ చేయించాల్సిన పట్టణ ప్రణాళిక అధికారులు పట్టనట్లుగా ఉంటున్నారు.

# అవినీతి మొత్తం బయటకు తీస్తాం.. అరెస్టులు కూడా జరుగుతాయి: సజ్జల



తాడేపల్లి: అమరావతి పేరుతో భారీ అవినీతి జరిగిందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. జరిగిన అవినీతి మొత్తం బయటకు తీస్తామని తెలిపారు. సిట్ దర్యాప్తుతో మరిన్ని వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు. కచ్చితంగా అరెస్టులు కూడా జరుగుతాయని అన్నారు. సుప్రీంకోర్టులోఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి భారీ విజయం దక్కిందన్నారు సజ్జల రామకృష్ణారెడ్డి. విధానపరమైన నిర్ణయాలతో రాష్ట్రానికి నష్టం కలిగిస్తే తప్పేనని పేర్కొన్నారు. గతంలో జరిగిన తప్పులను తప్పకుండా సమీక్ష చేయాల్సిందేనని తెలిపారు. రాష్ట్ర సంపదకు నష్టం కలిగించే కుట్రలను బయటకు తీస్తామన్నారు. టీడీపీ హయాంలో తప్పు చేయకపోతే వారికి భయమెందుకని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలోనూ చంద్రబాబు హస్తం ఉందని సజ్జల పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ స్కాంకు రాజధాని పేరు పెట్టారని.. అమరావతి పేరు చెప్పి దోచుకోవాలనుకున్నారని మండిపడ్డారు. అరచేతిలో స్వర్గం చూపించి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాత్కాలిక నిర్మాణాల్లోనూ అవినీతికి పాల్పడ్డరన్నారు. టీడీపీ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కంభకోణం జరిగిందన్నారు. నిజనిజాలను బయటకు తీసేందుకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాజధాని పేరుతో చంద్రాబాబు ముఠా దోచుకున్నారని సజ్జల దుయ్యబట్టారు. తప్పు చేయకపోతే స్టే కోసం కోర్టులకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ సహా చంద్రబాబు ముఠాకు ఎందుకంత భయమని అన్నారు.

టీడీపీ హయాంలో అక్రమాలపై సిట్ ఏర్పాటు జరిగిందని, సిట్ దర్యాప్తుపై స్టే తెచ్చుకుంటే అందులో ఏదో మతలబు ఉన్నట్లేనని అన్నారు. టీడీపీ నేతల్లో ఒకవైపు భయం, మరోవైపు అహంకారం కనిపిస్తోందన్నారు. సిట్ ఏర్పాటు కక్ష సాధింపు కానే కాదని స్పష్టం చేశారు.

# వాప్‌కాస్ మాజీ సీఎండీ ఇంట్లో రూ.38కోట్లు సీజ్.. తండ్రీ కొడుకు అరెస్టు

దిల్లీ: కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నియంత్రణలో పనిచేసే ప్రభుత్వరంగ సంస్థ వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ మాజీ సీఎండీ రాజిందర్ కుమార్ గుప్తా ఇంట్లో భారీగా నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపుతోంది. ఆయనకు చెందిన నివాసాల్లో సీబీఐ ఏకకాలంలో జరిపిన తనిఖీల్లో ఇప్పటివరకు మొత్తంగా రూ.38. కోట్లకు పైగా నగదు పట్టుబడింది. ఆదాయ మార్గాల కన్నా ఎక్కువగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించి గుప్తాపై ఇటీవల కేసులు నమోదు చేసినట్లు అధికారులు నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టిన కేసులో గుప్తాతో పాటు ఆయన తనయుడు గౌరవ్ సింఘాల్‌ను సీబీఐ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. 2011 ఏప్రిల్ నుంచి 2019 మార్చి 31వరకు వాప్‌కాస్ సంస్థలో గుప్తా పదవీకాలంలో ఉన్న సమయంలో భారీగా అక్రమార్జనకు పాల్పడినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాజిందర్ కుమార్ గుప్తాతోపాటు ఆయన భార్య రీమా సింఘాల్, తనయుడు గౌరవ్ సింఘాల్, కోడలు కోమల్ సింఘాల్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారులు.. దిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్, సోనిపట్, ఘజియాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 19 చోట్ల సోదాలు జరిపారు. ఈ సోదాల్లో మంగళవారం రూ.20 కోట్ల నగదు స్వాధీనం చేసుకోగా.. బుధవారం మరో రూ.18 కోట్లకు పైగా డబ్బును సీజ్ చేసినట్టు సీబీఐ అధికార ప్రతినిధి వెల్లడించారు.



భారీగా నగదుతో పాటు నగలు, విలువైన ఆభరణాలు, ఆస్తులకు సంబంధించిన పలు దస్త్రాలను సైతం స్వాధీనం చేసినట్టు తెలిపారు. గుప్తా పదవీ విరమణ చేసిన తర్వాత దిల్లీలో ఓ ప్రైవేటు కన్సల్టెన్సీ వ్యాపారాన్ని ప్రారంభించినట్టు కూడా ఆరోపణలు ఉన్నాయి. స్థిరాస్తుల్లో పలు ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీస్‌తో పాటు దిల్లీ, గురుగ్రామ్, పంచకుల, సోనిపట్, చండీగఢ్‌లలో ఫామ్ హౌస్‌లు కూడా ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయని అధికారి వెల్లడించారు.



# భోగాపురం ఎయిర్‌పోర్టును వైయస్ఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా ప్రకటించాలి

విజయనగరం: భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా ప్రకటించాలని, మా ప్రాంత ప్రముఖులు కొమ్మూరు అప్పుడుదొర, పెనుమత్స సాంబశివరాజు పేర్లు పెట్టేందుకు అవకాశం ఉంటే పరిశీలించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ...భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పనులకు ఇవాళ సీఎం వైయస్ జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడారు. అందరికీ నమస్కారం, భోగాపురం ఎయిర్‌పోర్ట్ చిరకాల వాంఛ, గత ప్రభుత్వం 15 వేల ఎకరాల భూసేకరణ కావాలని ప్రజలందరినీ ఇబ్బంది పెడితే నాడు శ్రీ జగన్ గారు మన ప్రాంతానికి వచ్చి మన పక్షాన పోరాడి, అన్ని వేల ఎకరాలు అవసరం లేదని, 3 నుంచి 5 వేల ఎకరాలతో ఎయిర్‌పోర్ట్ కట్టవచ్చని మన తరుపున పోరాడారు. 2019లో మన ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎంగారి చొరవతో అందరికీ నష్టపరిహారం ఇచ్చి, కేసులు ఎత్తివేసి ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నారు. సీఎంగారు మాట తప్పకుండా ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్నారు. గతంలో దివంగత వైఎస్ఆర్ గారు ఉన్నప్పుడు తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్ట్ ఆవశ్యకత చెప్పగానే ఆయన మంజూరు చేశారు, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు కూడా శంకుస్థాపన చేస్తున్నారు, స్థానికంగా ఉన్న కొన్ని సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుకుంటున్నాను. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా ప్రకటించాలని, మా ప్రాంత ప్రముఖులు కొమ్మూరు అప్పుడుదొర, పెనుమత్స సాంబశివరాజు పేర్లు పెట్టేందుకు అవకాశం ఉంటే పరిశీలించాలని కోరుతున్నాను. పాలకులు మంచి వారు అయితే ప్రజలు బాగుంటారు, ఆర్థిక సమస్యలు ఉన్నా ఇన్ని కార్యక్రమాలు చేస్తున్న ఏకైక సీఎం శ్రీ వైయస్ జగన్, సీఎంగారు చిరకాలం సీఎంగా ఉంటే మన ప్రాంత సమస్యలు పరిష్కారం అవుతాయి, మల్లికార్జున రావు గారు మన ప్రాంత వాసి, ఆయన సొంత ఊరు రాజాం కూడా విజయనగరం జిల్లాలో వచ్చింది, జీఎంఆర్ గారు కూడా ఇప్పుడు మా జిల్లా వాసే, ధన్యవాదాలు.

**విజన్, లీడర్‌షిప్, మంచి ఆలోచన ఉన్న నాయకుడు వైయస్ జగన్: గ్రంధి మల్లికార్జునరావు, ఛైర్మన్, జీఎంఆర్ గ్రూప్ –** అందరికీ నమస్కారం, ఈరోజు నాకు చాలా సంతోషంగా ఉంది, నేను ప్రపంచంలో చాలా ఎయిర్‌పోర్ట్‌లు కట్టాను, కానీ మా సొంత ఊరు రాజాం, వైజాగ్ రెండో ఊరు, నా ఫస్ట్ ఎయిర్‌పోర్ట్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్, శ్రీ రాజశేఖర్‌రెడ్డి గారు ఫౌండేషన్ వేశారు, ఆయనే



సీఎంగా ఉండగానే ప్రారంభించారు, రెండు మా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఇనాగ్యురేషన్ కి కూడా వైఎస్ఆర్ గారు వచ్చారు, ఈ రోజున భగవంతుడి నిర్ణయమో తెలీదు కానీ ఆయన తనయుడు శ్రీ జగన్ గారు తన అమృత హస్తాలతో శంకుస్థాపన చేయడం, వారే మళ్ళీ ఇనాగ్యురేట్ చేయాలని భగవంతున్ని కోరుకుంటున్నాను.

సీఎం గారి విజన్, లీడర్‌షిప్, పాలసీలు, ఆలోచనలు, మౌలికసదుపాయాల కల్పనపై పెడుతున్న దృష్టి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీ, సీ పోర్ట్‌లు, ఎయిర్‌పోర్ట్‌ల కనెక్టివిటీపై చేసిన పాలసీ, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వచ్చిన పెట్టుబడులపై సీఎంగారికి నా అభినందనలు, ఆ సమావేశం ఒక అద్భుతం, నేను కూడా అందులో భాగస్వామ్యం అయ్యాను, ప్రపంచంలో మాకిది 12 వ ఎయిర్‌పోర్ట్, హైదరాబాద్, గోవా తర్వాత మేం నిర్మిస్తున్న మూడో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మేం నిర్మిస్తాం, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ చేసిన కొత్తలో 1999–2000 లో 7 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉండగా, ఇప్పుడు 500కు చేరాయి. దీనివల్ల తెలంగాణ రాష్ట్ర ఎకానమీనే మారిపోయింది. అదే విధంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను కూడా కడతాం, ఇక్కడ కార్గో కూడా ఉండడం వల్ల రైతులకు, మత్స్యకారులకు, ఫార్మా ఇండస్ట్రీకి ఎగుమతులకు ఉపయోగకరంగా ఉంటుంది, ఇక్కడి సంస్కృతిని చూసి ఈ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేశాం, మేం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ తీసుకున్నప్పుడు అధ్వానంగా ఉండేది, దానిని నెంబర్ వన్ ఎయిర్‌పోర్ట్‌గా మార్చాం, అదే విధంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను చేస్తాం, భగవంతుడు కూడా వర్షం రూపంలో మనల్ని దీవించారు, నేను జీఎంఆర్ తరపున 36 నెలల్లో నెంబర్ వన్ ఎయిర్‌పోర్ట్ కడతానని హామీ ఇస్తున్నాను, మీరే మళ్ళీ ప్రారంభించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.




ఆసియాలో అత్యంత వేగంగా ద్రవ్యోల్బణం పెరుగుతున్న దేశంగా ఏప్రిల్‌లో పాకిస్థాన్ నిలిచింది. గతంలో ఈ రికార్డు శ్రీలంక పేరిట ఉండేది. పాక్‌లో రిటైల్ ధరలు గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 36.4 శాతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 1964 తర్వాత ద్రవ్యోల్బణం ఈ స్థాయిలోకి చేరడం ఇదే తొలిసారి. బ్లూమ్‌బెర్గ్‌సర్వే ప్రకారం ఏప్రిల్‌లో శ్రీలంక ద్రవ్యోల్బణం 35.3 శాతానికి తగ్గడంతో అక్కడి ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందనే సంకేతాలు వచ్చాయి. మరోవైపు పాకిస్థాన్ కరెన్సీ పతనం కూడా ఆ దేశ కష్టాలను మరింత ఎగదోస్తోంది. 2023లో పాక్ రూపాయి డాలర్‌తో పోలిస్తే 20 శాతం పతనమైంది. ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన కరెన్సీల్లో ఒకటిగా నిలిచింది. గత నెలలో పాక్ రూపాయి జీవిత కాల కనిష్ఠానికి చేరింది. రవాణా ధరలు 56.8 శాతం పెరిగాయి. ఇక ఆహార ద్రవ్యోల్బణం కూడా గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే 48.1 శాతం పెరిగింది. దుస్తులు, పాదరక్షల ధరలు 21.6 శాతం, హౌసింగ్, నీరు, విద్యుత్తుకు సంబంధించిన ధరలు 16.9 పెరిగాయి. ఐఎంఎఫ్ నుంచి 6.5 బిలియన్ డాలర్ల రుణ కార్యక్రమాన్ని పునరుద్ధరించడానికి పాక్ ఆపసోపాలు పడుతోంది. తాజాగా ఆ సంస్థ మెప్పుకోసం దేశీయంగా పూర్తిస్థాయిలో పన్నులు పెంచాల్సి ఉంది. అప్పుడు ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉంది. ధరల ఒత్తిడిని తగ్గించుకోవడానికి పాకిస్థాన్ గతనెల వడ్డీరేట్లను 21శాతానికి చేర్చింది. 1956 తర్వాత ఈ స్థాయిలో వడ్డీ రేట్లు ఉండటం ఇదే తొలిసారి. ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం కారణంగా దేశ ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని కార్మిక నేతలు ఇటీవల మేడే సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. నగరాల్లో ర్యాలీలను కూడా అధికారులు నిషేధించారు. మెరుగైన హక్కుల కోసం పెషావర్‌లో కార్మిక సంఘాలు గళమెత్తాయి. లాహోర్, కరాచీల్లో సెమినార్లు, ర్యాలీలు కొనసాగాయి.




హైదరాబాద్: దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని సీబీఐ పేర్కొంది. అవినాష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఇటీవల హైకోర్టులో సీబీఐ కౌంటరు దాఖలు చేసింది. సీబీఐ కౌంటరులో వివేకా హత్య దర్యాప్తుపై కీలక వివరాలు వెల్లడించింది. "అవినాష్‌రెడ్డి దురుద్దేశ పూరితంగానే దర్యాప్తునకు సహకరించట్లేదు. సమాధానాలు దాట వేశారు, వాస్తవాలు చెప్పలేదు. అవినాష్‌ను అరెస్టు చేసి కస్టడీలో ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. ఆయనకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు ముందుకు రావట్లేదు. అతని అనుచరుల వల్ల దర్యాప్తునకు ఆటంకం కలిగింది. దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేస్తున్నారు. అవినాష్‌కు నేరచరిత్ర ఉంది. నాలుగు క్రిమినల్ కేసులు ఉన్నాయి. సాక్షులను ప్రభావితం చేసినట్టు మా దృష్టికి వచ్చింది. వివేకా పీఏ కృష్ణారెడ్డి, సీఐ శంకరయ్య, గంగాధర్‌రెడ్డి ప్రభావితమైనట్టు కనిపిస్తోంది. వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాలు చెరిపేయడంలో అవినాష్ ప్రమేయం ఉంది. హత్యాస్థలిలో ఆధారాలు చెరిపేయడం కుట్రలో భాగమే. సునీల్ యాదవ్‌తో అవినాష్‌రెడ్డికి సంబంధమేంటో తెలియాలి. హత్య జరిగిన రోజు అవినాష్‌రెడ్డి ఇంటికి సునీల్ యాదవ్ ఎందుకెళ్లాడో తేల్చాలి. కుట్రలో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందేమో తెలుసుకోవాలి. మార్చి 15న అవినాష్‌రెడ్డి ఎక్కడెక్కడున్నారో నిర్ధారించాలి. నేరాన్ని తనపై వేసుకుంటే రూ.10కోట్లు ఇస్తామన్నారని గంగాధర్‌రెడ్డి అన్నారు. గంగాధర్‌రెడ్డి వాంగ్మూలంలో వాస్తవం తేలాలి. దస్తగిరిని ఓబుల్‌రెడ్డి, భరత్ యాదవ్ ఎందుకు కలిశారో తేలాలి" అని కౌంటర్‌లో సీబీఐ పేర్కొంది.

**షమీమ్‌తో పెళ్లికి వివేకా హత్యకు సంబంధం లేదు: సీబీఐ –** "వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టు తర్వాత ర్యాలీలు జరగటం సాక్షులను ప్రభావితం చేయడమే. హత్యలో సునీత, రాజశేఖర్‌రెడ్డి, శివప్రకాష్‌రెడ్డికి ప్రమేయంపై ఆధారాలు లేవు. వివేకా రాసిన లేఖను దాచటంలో దురుద్దేశం కనిపించట్లేదు. తాము వచ్చే వరకు లేఖను దాచాలని వివేకా పీఏకు రాజశేఖర్ చెప్పారు. సునీత, రాజశేఖర్ రాగానే ఎస్పీ సమక్షంలో లేఖను పోలీసులకిచ్చారు. ముందుగా దాచిపెట్టినందునే లేఖను కాపాడగలిగారు. కడప ఎంపీ టికెట్ తనకు ఇవ్వాలని వివేకా అడిగారు. తనకు కాకుంటే షర్మిల, విజయమ్మకైనా టికెట్ ఇవ్వాలని కోరారు. కడప నుంచి పోటీకి షర్మిలను వివేకానందరెడ్డి ఒప్పించారు. షమీమ్‌తో పెళ్లికి వివేకా హత్యకు సంబంధం లేదు. షమీమ్‌ను వివేకా పెళ్లి చేసుకోవడం శివప్రకాశ్‌రెడ్డికి ఇష్టం లేదు" అని సీబీఐ పేర్కొంది.




ఇచ్ఛాపురం: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బాహుదా నదిపై ఉన్న వంతెన కూలిపోయింది. బుధవారం ఉదయం గ్రానైట్ రాళ్ల లోడుతో లారీ వెళ్తుండగా ఒక్కసారిగా వంతెన కూలింది. వివరాల్లోకి వెళితే.. ఒడిశాలోని అస్కా నుంచి ఒంగోలుకు 70 టన్నుల గ్రానైట్ రాళ్ల లోడుతో లారీ వెళుతోంది.


భారీ బరువుతో వచ్చే వాహనాలు సాధారణంగా పక్కనే ఉన్న జాతీయ రహదారి పైనుంచి వెళ్తుంటాయి. కానీ గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ మాత్రం ఇచ్ఛాపురం పట్టణం మీదుగా వచ్చింది. ఈ క్రమంలో బాహుదా నది వద్దకు చేరుకోగానే వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో లారీ కిందికి నదిలోకి జారిపోయింది. నదిలో నీరు లేకపోవడం.. ప్రమాదం జరిగిన సమయంలో వంతెనపై ఇతర వాహనాల రాకపోకలు జరగకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బ్రిడ్జి కూలిపోవడంతో నేరుగా ఇచ్ఛాపురం పట్టణంలోకి వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దానికి ప్రత్యామ్నాయంగా పోలీసులు జాతీయ రహదారి వైపు నుంచి బస్సులు, ఇతర వాహనాలను మళ్లిస్తున్నారు. బాహుదా నదిపై ఈ వంతెనను 1929లో అప్పటి బ్రిటీష్ పాలనలో నిర్మించారు. ఎప్పటి నుంచో బ్రిడ్జి బలహీనంగా మారుతున్నా పాలకులు పట్టించుకోలేదని.. అందుకే నేడు కూలిపోయిందనే విమర్శలు వస్తున్నాయి.

# జగన్ దళిత ద్రోహి: లోకేశ్



కర్నూలు: సీఎం జగన్ పై టీడీపీ నేత నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ దళిత ద్రోహి అని దుయ్యబట్టారు. దళితులపై దమనకాండ జరుగుతోందని, దళితులను చంపడానికి స్పెషల్ లైసెన్స్ ఇచ్చారని ధ్వజమెత్తారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. 27 దళిత సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారని విమర్శించారు. సామాజిక న్యాయానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే విదేశీ విద్యా పథకం ప్రారంభిస్తామని, వైసీపీ నేతలు లాక్కున్న దళితుల భూములను తిరిగి ఇప్పిస్తామని ప్రకటించారు. దళితులకు భూమి కొని కేటాయిస్తామని నారా లోకేశ్ ప్రకటించారు.

# రైతులను ఆదుకోవడంలో జగన్ సర్కార్ విఫలం



అమరావతి : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు అండగా నిలవడంలో ఏపీ సీఎం జగన్ రెడ్డి విఫలమయ్యారని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలకు అండగా నిలవాలని శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. 4,5 తేదీలలో ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. వర్షాలపై ముందస్తు సమాచారం, ఏర్పాట్లు చేయకపోవడంతో ఎక్కువగా పంట నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని రైతులను కనీసం పరామర్శించడం లేదని చంద్రబాబు విమర్శించారు. ఐదేళ్ల కిందట ప్రారంభోత్సవం జరిగిన భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను తన సొంత ప్రచారం కోసం తిరిగి ప్రారంభించారని పేర్కొన్నారు. ఫుల్ పేజీ యాడ్‌లకు ప్రభుత్వ ధనం భారీగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఇవ్వాల్సిన అవసరం లేకున్నా కేవలం కమీషన్ల కోసం హిందూజాలకు, అమూల్‌కు వేలకోట్లు ప్రభుత్వ ధనం ధారాదత్తం చేశారన్నారు.

## పెద్ద సినిమాతో పెద్ద పేరు వస్తుందనుకుంటే..!

అఖిల్ అక్కినేని హీరో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన మూవీ ఏజెంట్. ఈ చిత్రం గతవారం విడుదలై మొదటి షో నుండే విపరీతమైన నెగెటివ్ టాక్ అందుకుంది. ఏ విభాగంలోనూ కనీసం పాజిటివ్ టాక్ తెచ్చుకోలేక బాక్సాఫీస్ ముందు పూర్తిగా నిరాశపరిచింది. ఏజెంట్ మూవీ చెప్పుకోవడానికి ఏ ఒక్కటీ లేదని రివ్యూయర్లు చెబుతున్నారు. ఇందులో అఖిల్ లుక్ తప్పించి దాని కోసం అతడు పడిన కష్టం తప్ప సినిమాలో ఏదీ వర్కవుట్ కాలేదు. సినిమాలో బీస్ట్ లుక్ మాత్రం బాగుందనే చెప్పాలి. అలాగే సినిమాలో లవ్ ట్రాక్ మరీ విసిగించింది. బీస్ట్ తరహాలో కనిపించే హీరో పక్కన



అందాల సుందరి చూడటానికి బ్యూటీ అండ్ ది బీస్ట్ లా కనిపిస్తుందని అనుకున్నారు. హీరోయిన్ సాక్షి వైద్య తన అందాల ఆరబోతతో రొమాంటిక్ రిలీఫ్ ఇస్తుందని భావించారు. కానీ హీరోయిన్ పాత్ర మరీ నామమాత్రంగా సాగుతుంది. మినిమం స్క్రీన్ ప్రెజెంటేషన్ లేకపోవడంతో తను ప్రేక్షకులకు కనెక్ట్ కాలేకపోయింది. అలా మధ్య మధ్యలో వచ్చే లవ్ ట్రాక్ బోర్ కొట్టేలా మారిపోయింది.

మూవీ మేకర్స్ సాక్షి వైద్య అందాలను ఏమాత్రం వాడుకోక పోవడం తనకు మినిమం స్క్రీన్ టైం ఇవ్వకపోవడంతో సాక్షి వైద్య స్పార్క్ కనిపించకుండా పోయింది. సినిమా విడుదలకు ముందు నిర్మాత అనిల్ సుంకర సహా ఏజెంట్ టీమ్ అంతా సాక్షి వైద్యకు విపరీతమైన హైప్ ఇచ్చారు. రాబోయే రోజుల్లో స్టార్ హీరోయిన్ గా ఎదగబోతుందని ఆకాశానికి ఎత్తారు. కానీ గ్రౌండ్ రియాల్టీ మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తను గ్లామర్ పరంగా కూడా సినీ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. తన అభినయం కూడా సో సో గా ఉంది అనే టాక్ వినిపించింది. ఇక ఏజెంట్ సినిమా ఈ మధ్యకాలంలో వచ్చిన బిగ్గెస్ట్ డిజాస్టర్ గా నిలుస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నారు. అనిల్ సుంకర సురేందర్ రెడ్డి కలిసి రూ.65 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ చిత్రం ఏమాత్రం ఆకట్టుకునే రీతిలో కలెక్షన్లు రాబట్టడం లేదు. విడుదలైన తొలి రోజు రూ.5.95 కోట్లు రెండో రోజు రూ.1.6 కోట్లు మూడో రోజు అతి తక్కువగా రూ.1 కోటి ఇండియా నెట్ కలెక్షన్స్ మాత్రమే సాధించింది.

## ఫ్లాప్స్ వచ్చినా ఆగని రష్మిక


నేషనల్ క్రష్ రష్మిక బాలీవుడ్ లో రాణించేందుకు బాగానే కష్టపడుతోంది. ఆమె పుష్ప సినిమాతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. దీంతో బాలీవుడ్ లో ఎలాంటి కష్టం లేకుండా వెంట వెంటనే అవకాశాలు చేజిక్కించుకుంది. వరసగా గడ్ బై మిషన్ మజ్నూ వంటి సినిమాల్లో నటించింది. ఆ సినిమాలపై ఎక్కువ ఆశలు పెట్టుకుంది కానీ పెద్దగా ఫలితం దక్కలేదు. ఈ రెండు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. అయితే.. రెండు వరసగా ఫ్లాప్ అయినా కూడా ఆమెకు బాలీవుడ్ లో మరో సినిమా దక్కింది. మరాఠీ యోధుడు మరాఠీ రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. అయితే ఇప్పుడు అలాంటి యుద్ధ వీరుడి కోడలిగా నటించబోతుందట రష్మిక. శివాజీ పెద్ద కుమారుడు శంభాజీ భోంస్లే జీవితం ఆధారంగా.. బాలీవుడ్లో ఓ భారీ పీరియాడికల్



ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో బాలీవుడ్ యంగ్ హీరో విక్కీ కౌశాల్ హీరోగా నటించనున్నాడట. శంభాజీ భోంస్లేగా విక్కీ కౌశల్ ఆయన భార్య మహారాణి ఏసుబాయి భోంస్లేగా రష్మికా మందన్నా నటించనున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమాకు 'ఛావా' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు టాక్. ఇక ఈ ప్రాజెక్ట్ను భారీ బడ్జెట్తో తెరకెక్కించబోతున్నారట. ఇప్పటికే రష్మిక ఈ ప్రాజెక్ట్కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాదు.. మహారాణిగా ట్రైనింగ్ కూడా స్టార్ట్ చేసేసిందట. అప్పటి యాస భాషతో పాటు యుద్ధ విన్యాసాల ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటోందట. హీరో విక్కీ కౌశాల్ కూడా గత కొద్ది రోజులుగా గుర్రపుస్వారీ కత్తి యుద్ధం విలువిద్య నేర్చుకుంటున్నారని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ను అఫిషీయల్గా ప్రకటించి.. సెప్టెంబర్లో షూటింగ్ స్టార్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట. మరి ఛత్రపతి శివాజీ కోడలిగా మహారాణిగా రష్మిక ఎలా మెప్పిస్తుందో చూడాలి. ఇదిలా ఉండగా రష్మిక నటించిన పుష్ప2 షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. ఈ సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. పుష్పతో ఆకట్టుకున్న రష్మిక.. పుష్ప2లో ఆమె క్యారెక్టర్ ఎలా సాగుతుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## ఎన్టీఆర్ 30.. ఆమె అవసరం ఉందా..?







తర్వాత ఎన్టీఆర్ కొరటాల శివ తో సినిమా ఫిక్స్ చేసుకున్నాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్ యువ సుధ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్ లో భారీ బడ్జెట్ తో ప్లాన్ చేశారు. సినిమాలో బాలీవుడ్ భామ జాన్వి కపూర్ హీరోయిన్ గా నటించింది. అనిరుద్ రవిచంద్రన్ మ్యూజిక్ కంపోజర్ గా ఫిక్స్ అయ్యారు. సినిమాలో జాన్వి ఉన్నా సరే కథ ప్రకారం మరో హీరోయిన్ అవసరం ఉంటుందని టాక్. అందుకే ఆ పాత్రలో సాయి పల్లవి ని సెలెక్ట్ చేశారని తెలుస్తుంది. మలయాళ సినిమా ప్రేమంతో సౌత్ ఆడియన్స్ ను అలరించిన సాయి పల్లవి తన సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్ గా మారింది. ఇప్పటివరకు స్టార్ హీరోల సినిమాల్లో కాకుండా టైర్ 2 హీరోలతోనే నటిస్తూ సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగిస్తుంది అమ్మడు. ఇక ఇప్పుడు ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. సాయి పల్లవి సినిమాలో ఉంది అంటే ఆ సినిమాకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడుతుంది. ముఖ్యంగా సాంగ్స్ విషయంలో చాలా క్రేజ్ వస్తుంది. అమ్మడు డాన్స్ చేసే ఒక్క సాంగ్ అయినా కూడా ట్రెండింగ్ లోకి వస్తుంది. ఎన్టీఆర్ కూడా మంచి డాన్సర్ ఇప్పుడు అతని సినిమాలో సాయి పల్లవి నటిస్తుంది అంటే ఇద్దరు కలిసి ఒక డ్యాన్స్ నెంబర్ వేస్తే మాత్రం ఓ రేంజ్ లో ఉంటుందని చెప్పొచ్చు. కొరటాల శివతో ఆల్రెడీ జనతా గ్యారేజ్ సినిమా చేసిన తారక్ మరోసారి ఈ కాంబోలో ఈసారి పెద్ద టార్గెట్ తో వస్తున్నాడు. అసలైతే ఆచార్య ఫ్లాప్ కి పూర్తి బాధ్యత కొరటాల శివదే అంటూ అతని మీద బాగా నెగిటివిటీ వచ్చేసింది. అయినా సరే తారక్ కొరటాల శివ మీద నమ్మకం ఉంచి సినిమా చేస్తున్నాడు. ట్రిపుల్ ఆర్ తర్వాత చరణ్ గేమ్ ఛేంజర్ గా శంకర్ సినిమాతో వస్తుంటే కొరటాల శివతో తారక్ ప్రయోగం చేస్తున్నాడు. 2024 ఏప్రిల్ లో ఎన్టీఆర్ 30వ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ ఏడాది చివరి కల్లా సినిమా ప్రొడక్షన్ పూర్తి చేసి నెక్స్ట్ ఇయర్ 3 నెలలు పోస్ట్ ప్రొడక్షన్ వి.ఎఫ్.ఎక్స్ వర్క్ చేయించాలని కొరటాల శివ ప్లాన్.

## సింగం తెరంతా కలర్ ఫుల్ గా ఉందే!






బాలీవుడ్ సక్సెస్ ఫుల్ సింగం ఫ్రాంచైజీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అజయ్ దేవగణ్ కథానాయకుడిగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్రాంచైజీకి హిందీ మార్కెట్ లో అసాధారణమైన క్రేజ్ ఉంది. ఇప్పటివరకూ రిలీజ్ అన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో షేక్ చేసాయి. కాప్ యూనివర్శల్ భాగంగా మళ్లీ సింగం ఎగైన్ అంటూ మళ్లీ ఈ ద్వయం రంగం సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ముగింపులో సింగం ఎగైన్ సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో సినిమా గురించి లీక్ అయ్యే ఒక్కో అప్ డేట్ అంతకంతకు ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. సింగం ఎగైన్ లో ఈ సారి తెరంతా రంగుల మయం కానుందని తెలుస్తోంది. ఇప్పటికే అజయ్ దేవగణ్ సరసన ఓ స్టార్ హీరోయిన్ ని ఎంపిక చేసే పనిలో ఉన్నారు. అదీ కాక ఇంకా మరింత మంది నాయికల్ని ఈ సిరీస్ లోకి తీసుకొస్తున్నారు. దీపికా పదుకొణే ని ఓ కీలక పాత్రకి సంబంధించి ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తి చేసారు. ఇంత పెద్ద హీరోయిన్ తీసుకొచ్చా రంటే? సినిమాలో ఆమె పాత్ర పవర్ ఫుల్ గా ఉంటుందన్నది గెస్ చేయొచ్చు. దీపిక ఎంట్రీతోనే సింగంకి అదనపు హంగులు యాడ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో స్టార్ హీరోయిన్ ని తెరపైకి తెస్తున్నారు. కరీనా కపూర్ కూడా సినిమాలో భాగమవుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరో కీలక మైన పాత్రలో ఆమెని దించాలని దర్శకుడు భావిస్తున్నాడుట. ఇదే సిరీస్ లో వచ్చిన సింగం రిటర్న్స్ లో ఇప్పటికే కరీనా నటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి సెంటిమెంట్ గా ఆ భామని రంగంలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. ఇక మెయిన్ లీడ్ రేసులో ఎంత మంది భామలు పోటీలో ఉన్నారో చూడాలి. కీలక పాత్రలకే స్టార్ హీరోయిన్లనే దించుతున్నారంటే? అజయ్ సరసన భామ అంటే అంతకు మించి ఉండేలా ప్లాన్ చేసే అవకాశం ఉంది. మొత్తంగా సింగం ఎగైన్ తెరంతా రంగులమయం అవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.

## భోళా శంకర్ అలా చేస్తే రిస్క్ లో పడ్డట్టే..!

వాల్తేరు వీరయ్య తర్వాత మెగాస్టార్ చిరంజీవి చేస్తున్న సినిమా భోళా శంకర్. షాడో తర్వాత మెహర్ రమేష్ తో రిస్క్ చేయాలని ఎవరు అనుకోలేదు. కానీ చిరు మాత్రం అతనికి మరో ఛాన్స్ ఇచ్చారు. భోళా శంకర్ సినిమాను మెహర్ రమేష్ డైరెక్ట్ చేస్తున్నారు. కోలీవుడ్ లో అజిత్ చేసిన వేదాళం రీమేక్ గా ఈ సినిమా వస్తుందని టాక్. చిరు రీ ఎంట్రీ తర్వాత రీమేక్ సినిమాలనే చేస్తూ వస్తున్నాడు. అయితే గాడ్ ఫాదర్ ఇచ్చిన షాక్ తో భోళా శంకర్ తర్వాత ఇక రీమేక్ లు చేసేది లేదని గట్టిగా ఫిక్స్ అయ్యాడట. భోళా శంకర్ సినిమాలో తమన్నా చిరుతో జోడీ కడుతుంటే సినిమాలో కీర్తి సురేష్ చిరుకి సిస్టర్ రోల్ లో కనిపిస్తుంది. మహానటిగా తన సత్తా చాటుతున్న కీర్తి రీసెంట్ గా దసరాతో కూడా తన టాలెంట్ చూపించింది. దసరా



సినిమాలో వెన్నెల పాత్రలో కీర్తి అదరగొట్టేసింది. కీర్తిని సరిగా వాడుకోవట్లేదు కానీ ఆమెతో ఎలాంటి ప్రయోగాలైనా చేసేయొచ్చు అని మరోసారి ప్రూవ్ చేసుకుంది. అయితే ఇది ఇప్పుడు భోళా శంకర్ కి మైనస్ అయ్యే ఛాన్స్ ఉంది. మెగాస్టార్ సినిమాలో సిస్టర్ రోల్ కి కీర్తిని ఎంచుకోవడం పెద్ద షాక్ ఇచ్చింది. సినిమాలో ఆ పాత్ర ఎంత ఇంపార్టెంట్ అయినా సక్సెస్ ఫుల్ హీరోయిన్ ఆమెతో ప్రయోగాలు కూడా చేయొచ్చు అనిపించే హీరోయిన్ ని చిరుకి సోదరిగా చేశారు. అఫ్కోర్స్ కీర్తి కూడా మెగాస్టార్ తో నటించాలనే కోరికతో ఈ ఆఫర్ ఒప్పుకుని ఉండొచ్చు. కానీ కీర్తికి ఇప్పుడున్న ఈ క్రేజ్ దృష్ట్యా సినిమాలో ఆమె పాత్ర ఏమాత్రం వెయిట్ తగ్గినా భోళా శంకర్ రిస్క్ లో పడినట్టే అని చెప్పొచ్చు. కొంతమంది హీరోయిన్స్ వారికి ఉన్న క్రేజ్ కి అందుకు తగిన పాత్రలో నటించాలని ప్రేక్షకులు అభిప్రాయపడతారు. ఈ క్రమంలో కీర్తి సురేష్ భోళా శంకర్ సినిమాలో సిస్టర్ రోల్ అని తెలిసినా ఆ పాత్రని చాలా తగ్గిస్తే మాత్రం ఆ ఎఫెక్ట్ సినిమా రిజల్ట్ మీద ఆధాపడుతుందని అంటున్నారు.

అలా కాకుండా కీర్తిని పర్ఫెక్ట్ గా వాడుకుంటే మాత్రం ఆమె క్రేజ్ సినిమాకు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. దసరా హిట్ తో కీర్తి సూపర్ జోష్ లో ఉండగా నానితో ఆల్రెడీ నేను లోకల్ హిట్ కొట్టిన అమ్మడు దసరాతో ఈ కాంబో క్రేజ్ ని పెంచేసింది.

## మాళవిక సాఫ్ట్ అయినా..ఆలోచనలు మాత్రం మాస్!

మాలీవుడ్ బ్యూటీ మాళవిక నాయర్ టాలీవుడ్ కి సుపరిచితమే. ఎవడే సుబ్రమణ్యం సినిమాతో లాంచ్ అయిన అమ్మడు అటుపై కొన్ని సినిమాల్లో నటించింది. విజయాలు ఉన్నా లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే అందిపుచ్చుకుంటుంది. అందం..అభినయం గల నాయిక. చూడటానికి ఎంతో సాఫ్ట్ గానూ కనిపిస్తుంది. మరి ఈ బ్యూటీ మనసులో అన్నీ మాస్ ఆలోచనలే ఉన్నాయా? అంటే అవుననే తెలుస్తోంది. చూడటానికి మాళవిక సాఫ్ట్ గా ఉన్నా..లోపల అంతా ఊర మాస్ లెక్క. డీసెంట్ పాత్రలు పోషించడం కంటే యాక్షన్ నేపథ్యం గల సినిమాలు చేయడం అంటే ఎక్కువ ఇష్టం అంటుంది. దర్శకులు అలాంటి అవకాశాలతో ముందుకొస్తే ఎలాంటి మొహమాటం లేకుండా ఎస్ చెప్పేస్తుందిట.



తన దగ్గరకు ప్రతీ దర్శకుడు తనలో బ్యూటీని చూసి కొన్ని రకమైన పాత్రలకే పరిచయం చేస్తున్నట్లు చెప్పుకోచ్చింది. అలా కాకుండా తనలో మాస్ కోణాన్ని కూడా చూసి ఆ రకమైన పాత్రలతో వస్తే మరింత సంతోషిస్తానని అంటుంది. యాక్షన్ సినిమాలు చేయడం తనకి ఓ డ్రీమ్ గా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం నటిస్తోన్న డెవిల్ సినిమాలో ఆ రకమైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. అలాగే సినమా ఫలితాలు ఎలాంటి ప్రభావం చూపిస్తాయని ప్రశ్నిస్తే.. కొన్ని విషయాలు మన చేతుల్లో ఉండవు. కథలు ఎంపిక చేసుకోవడం..పాత్రలకు తగంట్టు నటించడం వంటివి మన నియంత్రణలోనే ఉంటాయి. కానీ ఫలితాలు అన్నిసార్లు మనకు అనుకూలంగా రావు. దాన్నివ్యక్తిగతంగా మాత్రం తీసుకోను. చూట్టూ వాతావరణంలో మార్పులు కనిపిస్తాయి. విజయాలు వచ్చినప్పుడు ఒకలా మాట్లాడుతారు. పరాజయాలు ఎదురైనప్పుడు మరోలా స్పందిస్తుంటారు. ఎదుట వారు ఎలా ఉన్నా మనమేంటి? అన్నది మన అంతరాత్మకి తెలుసు. కాబట్టి అలాంటి వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదని తెలిపింది. తాజాగా ఈ బ్యూటీ నటించిన అన్ని మంచి శకునాలే సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో సంతోశ్ శోభన్ హీరోగా నటించగా నందిని రెడ్డి దర్శకత్వం వహించారు.




## జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట భాజపా కార్పొరేటర్లు వినూత్న నిరసన!

బల్దియా కార్యాలయం ముందు భాజపా కార్పొరేటర్లు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం సందర్భంగా.. భాజపా కార్పొరేటర్లు నల్లని డ్రెస్‌లు ధరించి, లైఫ్ జాకెట్లు, స్విమ్మింగ్ బెలూన్లు, ఫైర్ సేఫ్టీ సిలిండర్‌లు తీసుకుని వచ్చారు. చిన్న వర్షం పడితే భాగ్యనగరం చిత్తడవుతుందని, నాలాలు పొంగిపొర్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## త్వరలోనే హైదరాబాద్‌లో వార్డు పాలన పద్ధతికి శ్రీకారం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రతి పౌరుడికి సత్వరమే సేవలు అందించాలనే ఉద్దేశంతో.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగరంలో వార్డుల పాలన పద్ధతి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చర్యలు ప్రారంభించారు. సచివాలయంలో పురపాలక శాఖపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. త్వరలోనే హైదరాబాద్‌లో వార్డు పాలన పద్ధతికి శ్రీకారం చుడుతామని ప్రకటించారు. జీహెచ్‌ఎంసీలో 150 వార్డుల్లో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. మే నెలఖారున ఈ వార్డు కార్యాలయాలు ప్రారంభిస్తామని చెప్పారు. పాలన వికేంద్రీకరణతో పౌరులకు వేగంగా పరిపాలన ఫలాలు అందాలి. వార్డు కార్యాలయంలో 10 మంది అధికారులు అందుబాటులో ఉంటారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఇంచార్జిగా ఉంటారు. సర్కిల్, జోనల్ ఆఫీసులకు వెళ్లకుండా వార్డు కార్యాలయంలోనే సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం. సిటిజన్ ఫ్రెండ్లీగా జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాలు ఉండాలి. ప్రతి వార్డు ఇంకో వార్డు కార్యాలయంతో అనుసంధానం కావాలని కేటీఆర్ సూచించారు.

## నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ ప్రారంభం.. గీత వృత్తి ప్రోత్సాహానికి సీఎం కేసీఆర్ కృషి



హైదరాబాద్ : హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నీరా కేఫ్‌ను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ప్రకృతి సిద్ధమైన, స్వచ్ఛమైన నీరాను రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు. గీత వృత్తిదారులకు రైతు బీమా తరహాలో గీత కార్మికుల బీమాను ప్రకటించిన సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు 'నీరాభిషేకం' చేశారు మంత్రి శ్రీనివాస్ గౌడ్. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గీత వృత్తి ప్రోత్సాహానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతు బీమా మాదిరిగా గీత కార్మికుల కోసం రూ. 5 లక్షల బీమాను కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 50 ఏండ్ల వయస్సు పైబడిన, అర్హులైన దాదాపు లక్ష మంది గీత కార్మికులకు ప్రతి నెల రూ. 2016 ల పెన్షన్లు అందిస్తున్నామన్నారు. మద్యం దుకాణం కేటాయింపుల్లో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాహెూసోపేతమైన నిర్ణయం అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గీత వృత్తి ప్రోత్సాహం కోసం తెలంగాణకు హరితహారంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 4 కోట్ల 20 లక్షల తాటి, ఈత మొక్కలు నాటినట్లు శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికి వేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన, ప్రకృతి సిద్ధమైన నీరాను అందించేందుకు ప్రతిష్టాత్మకంగా నీరా పాలసీని ప్రవేశపెట్టామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గీత వృత్తిదారులు మాత్రమే నీరాను ఉత్పత్తి చేసి, అమ్మకాలు జరిపేలా నీరాపాలసీని రూపొందించామన్నారు.

గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియాను రూ. 2 లక్షల నుండి రూ. 5 లక్షలకు పెంచడం జరిగిందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అలాగే, శాశ్వత అంగవైకల్యం చెందిన వారికి గతంలో ఇచ్చిన రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని రూ. 5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. కల్లు దుకాణాలు నెలవారి కిస్తీ, తాటి, ఈత చెట్ల పన్ను రద్దు చేయడం ద్వారా 7743 కల్లు దుకాణాలకు చెందిన 2లక్షల 34 వేల 576 కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు మంత్రి శ్రీనివాస్ గౌడ్.

## కనీస మద్దతు ధరకే తడిసిన ధాన్యాన్ని కొంటాం : మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట : వరి పంట వేసిన రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. తడిసిన వరి ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొంటామని మంత్రి స్పష్టం చేశారు. సిద్దిపేట కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొంటామని స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం రూ. 10 వేలు అందిస్తామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో భారీ వర్షాలు కురియడంతో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టోయారు. దీంతో మార్చి నెలలో వరిసాగు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు గానూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎల్లప్పుడూ రైతులందరికీ కేసీఆర్ అండగా ఉంటారని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరకే తడిసిన వరి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశాలు చేసినట్లు మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కోకాపేట్‌లో ఇస్కాన్ టెంపుల్.. 8న శంకుస్థాపన చేయనున్న సీఎం కేసీఆర్



హైదరాబాద్: ఐటీ కారిడార్‌లోని కోకాపేట్‌లో మరో ప్రతిష్ఠాత్మక కట్టడం రానున్నది. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ది ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్‌నెస్–ISKCON) ఇక్కడ అత్యంత విశాలమైన ప్రాంగణంలో అతిపెద్ద ఆలయాన్ని నిర్మించాలని ప్రణాళికలు రూపొందించింది. మే 8న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ ఆలయానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణ నమూనాను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

ప్రధానంగా శ్రీ రాధాకృష్ణ టెంపుల్ (బృందావన్ హెరిటేజ్), శ్రీనివాస గోవింద టెంపుల్ (సౌతిండియా హెరిటేజ్), రాజగోపు రం, నిత్యాన్నదాన సెంట్రల్ హాలు ప్రధానంగా ఉంటాయి.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను ఇస్కాన్ ప్రతినిధులు ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. హరేకృష్ణ హెరిటేజ్ టవర్ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. సీఎంను కలిసిన వారిలో హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌడ, చంద్రదాస తదితరులు ఉన్నారు.



## సిద్దిపేట టు సోలాపూర్.. ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రలోని సోలాపూర్‌కు ఆర్టీసీ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. సిద్దిపేట బస్ డిపోలో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మూడు డీలక్స్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్, జహీరాబాద్, హుమ్నాబాద్, ఉమర్గా, నాల్‌దుర్గ్ మీదుగా సోలాపూర్ చేరుకుంటాయని తెలిపారు. సిద్దిపేటలో ప్రతి రోజు ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6:20 గంటలకు సోలాపూర్ వెళ్లే డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. సోలాపూర్ నుంచి ప్రతి రోజు ఉదయం 7:30 గంటలకు, సాయంత్రం 10 గంటలకు సిద్దిపేటకు బయల్దేరుతాయన్నారు. సిద్దిపేట నుంచి గోండియా టౌన్‌కు కూడా త్వరలోనే ఆర్టీసీ బస్సులను నడుపుతామని హరీశ్‌రావు ప్రకటించారు. మరో పది రోజుల్లో సిద్దిపేట – హైదరాబాద్ మధ్య 10 డీలక్స్ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని హరీశ్‌రావు తెలిపారు. ఈ బస్సులన్నీ సికింద్రాబాద్ మీదుగా తమ రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని బస్సులను పెంచుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వీ రోజా శర్మ, టీఎస్‌ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్, డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా వర్క్ బుక్స్, నోట్ బుక్స్ : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా వర్క్ బుక్స్, నోట్ బుక్స్ అందజేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు వర్క్ బుక్స్ ను, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి సీఎం కె చంద్రశేఖర్ రావు తీసుకున్న గొప్ప నిర్ణయం ఇదని మంత్రి పేర్కొన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఉచిత పుస్తకాల నిర్ణయంతో రాష్ట్రంలోని 24 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. వర్క్ బుక్స్‌ను, నోట్ బుక్స్‌ను పాఠశాల ప్రారంభమయ్యే నాటికి అందజేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని విద్యార్థులందరికీ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలను పాఠశాల పునః ప్రారంభమయ్యే నాటికి అందజేయాలని ఆదేశించారు. గత సంవత్సరం పాఠ్య పుస్తకాల పంపిణీ కోసం రూ.132 కోట్లు ఖర్చు చేయగా, రానున్న విద్యా సంవత్సరానికిగాను రూ.200 కోట్లు వెచ్చించి పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు రూ.150 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫామ్ ను పాఠశాల పునః ప్రారంభం నాటికి అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జూన్ 12 నుంచి పాఠశాల పునః ప్రారంభమవుతున్నందున బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేసి అందులో స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ, పాఠ్య పుస్తకాల పంపిణీ, యూనిఫామ్‌ల పంపిణీ చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలలకు హాజరయ్యే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలన్నారు. పాఠశాల పునః ప్రారంభం రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం కల్పించాలని మంత్రి ఆదేశించారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ పాఠశాల విద్య సంచాలకులు, శ్రీ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ప్రభుత్వ ఆస్పత్రిలో మనవడికి టీకా వేయించిన ఎమ్మెల్యే



మెదక్: రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చెప్పారు. మెదక్ %వీజు% ఆస్పత్రిలో బుధవారం ఉదయం తన మనవడికి టీకా ఇప్పించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యలకు నిలయంగా ఉండేవన్నారు. దాంతో ప్రజలు ఆ ఆస్పత్రులకు వచ్చేందుకు జంకే వారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఆస్పత్రుల స్థాయి పెంచడంతోపాటు కోట్లాది రూపాయలు వెచ్చించి అత్యాధునిక యంత్రాలు, పరికరాలు సమకూర్చారని, వైద్యులతోపాటు ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేశారని చెప్పారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేకంగా అన్ని హంగులతో మాతా శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రైవేట్ హాస్పిటళ్లకు ధీటుగా ఉన్న %వీజు% లకు ఆదరణ బాగా పెరిగిందని, మెరుగైన వైద్య సేవలతోపాటు కేసీఆర్ కిట్, 12000 నగదు సాయం అందిస్తుండటంవల్ల వీటిలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆమె చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా హరీశ్ రావ్ బాధ్యతలు తీసుకున్న తరువాత మెదక్ జిల్లాలో ప్రభుత్వ పరంగా వైద్య సేవలు మెరుగు పరచడంపై స్పెషల్ ఫోకస్ పెట్టారని పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా ఆస్పత్రి ఐసీయూ, డయాలసిస్ సెంటర్, డయాగ్నోసిస్ హబ్, ఆక్స ప్లాంట్ వంటి సౌకర్యాలు అందుబాటులో కి వచ్చాయని, అన్ని రకాల చికిత్సలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 5న వరంగల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



వరంగల్: తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ఈ నెల 5న వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతమవడానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, తాటికొండ రాజయ్య, నన్నపనేని నరేందర్, ఒడితెల సతీశ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్ రావు, కుడా చైర్మన్ సుందర్ యాదవ్ తదితరులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు హసన్ పర్తి (ఎర్రగట్టు గుట్ట) కిట్స్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంక్యుబేషన్ సెంటర్ను ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తారు. అనంతరం హెచ్‌ఓడీలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు హసన్ పర్తి బాలాజీ గార్డెన్స్‌లో కేసీఆర్ కప్‌ను విజేతలకు అందజేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు హన్మకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు హంటర్ రోడ్‌లో సైన్స్ సెంటర్‌ను ఆరంభిస్తారు. సాయంత్రం 5.50 గంటలకు లష్కర్ బజార్ మర్కజీ స్కూల్లో నగరంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేస్తారు.

సాయంత్రం 6.15 గంటలకు గాంధీనగర్‌లో (అంబేద్కర్ భవన్, టీవీ టవర్ దగ్గర) మోడల్ వైకుంఠ ధామాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 6.45 గంటలకు సెయింట్ గ్యాబ్రిల్ స్కూల్లో పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఈ మొత్తం కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని మంత్రి ఎర్రబెల్లి ఆయా నేతలకు విజ్ఞప్తి చేశారు. అధికారిక కార్యక్రమాల్లో అధికారులు భాగస్వాములవుతారని, పార్టీ కార్యక్రమాల్లో మాత్రం పార్టీ నేతలు, కార్యకర్తలను విస్తృతంగా పాల్గొనేలా చూడాలని మంత్రి సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com